



Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 59 | బుధవారం 07 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ఢిల్లీలో హైటెన్షన్







## ఓట్ చోరీపై కదం తొక్కిన విపక్షాలు!

- ఇండి కూటమి ఆధ్వర్యంలో ఎంపీల భారీ ర్యాలీ
- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయం దిశగా 300 మంది ఎంపీల మార్చ్
- సర్ రద్దు, సీఈసీ రాజీనామాకు డిమాండ్
- మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత
- బ్యారికేడ్లెక్కి జాతీయజెండాతో నిరసన
- పోలీసులకు చిక్కకుండా 'ఆకాశవాణి'లోకి రాహుల్.. అక్కడే రాత్రి వరకు నిరసన
- ఆయన వెంట ప్రియాంక, కాంగ్రెస్ ఎంపీలు
- 9 గంటల హైడ్రామా తర్వాత బలవంతంగా అదుపులోకి.. అనంతరం విడుదల
- జ్ఞానేశ్ సాయంతో మోదీ, అమిత్ షా,
- మోహన్ భాగవత్ ఓట్ల చోరీ: రాహుల్
- ఎంపీలను కలవడానికి అభ్యంతరమేంటనిప్రశ్న..
- అపాయింట్‌మెంట్ కోరలేదన్న ఈసీ





న్యూఢిల్లీ - సూర్య వాస్తవం
దేశ రాజకీయాలను కుదిపేస్తున్న ఓట్ చోరీ వ్యవహారంపై విపక్షాలు కదం తొక్కాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ, ఇండి కూటమి ఎంపీలు చేపట్టిన నిరసనతో.. మంగళవారం ఢిల్లీ వీధుల్లో హైడ్రామా నడిచింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ నేతృత్వంలో 300 మందికి పైగా ఎంపీలు (లోక్‌సభ, రాజ్యసభ) చేపట్టిన మార్చ్ ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ కార్యక్రమానికి రాహుల్‌గాంధీ కేంద్ర బిందువుగా నిలిచారు.

- మిగతా 2లో..



## సుప్రీం జడ్జిగా అపరేశ్ సింగ్ ప్రమాణం

- గుజరాత్, ఢిల్లీ సీజేలు కూడా..ప్రమాణ స్వీకారం చేయించిన
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- 37కు చేరిన సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం
దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు కొత్తగా ఎంపికైన ముగ్గురు న్యాయమూర్తులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు కొత్త బ్లాక్ ఆడిటోరియంలో మధ్యాహ్నం జరిగిన ఈ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ వీరిచే ప్రమాణస్వీకారం చేయించారు. తెలంగాణ హైకోర్టు

- మిగతా 2లో..

## 'ఒక దేశం-ఒక ఎన్నిక'.. ఓ కుట్ర



- ఆ నినాదం వెనుక బీజేపీ ఉద్దేశాలు వేరే..
- 'ఒక దేశం-ఒక పార్టీ' అనేదే అసలు లక్ష్యం
- కాక్రోచ్ నేత అభిజీత్ దీప్కే ధ్వజం
- కార్యకర్తలకు పోలీసుల నోటీసులపై ఆగ్రహం

2

## చిక్కుల్లో ఈసీ

- సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలతో మరింత ముదురుతున్న 'సర్' వివాదం
- ఫారం-6లో మార్పులకు తమ ఆమోదం లేదన్న సర్వోన్నత న్యాయస్థానం
- ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే కొట్టేస్తామని కామెంట్
- ఎలాంటి మార్పులు చేయలేదు.. కేవలం డిక్లరేషన్ యాడ్ చేశాం: ఈసీ
- సీఈసీ జ్ఞానేశ్‌పై చర్యలు తప్పవా?.. కోర్టు తదుపరి విచారణపై ఉత్కంఠ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం
కేంద్ర ఎన్నికల కమిషన్ చుట్టూ వివాదం మరింత ముదురుతున్నది. ఒకవైపు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతి పక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తు ఒడగా.. మరోవైపు సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు



తాజాగా చేసిన వ్యాఖ్యల తో ఈసీ చిక్కుల్లో పడింది. 'సర్' ప్రక్రియలో భాగంగా ఫారం-6కు

- మిగతా 2లో..

## ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

- రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు
- నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- గత నెలలో రూ.1,345 కోట్ల పనులు జరిగాయని అధికారులు వెల్లడి
- ఔటర్ రింగ్ రోడ్డుపై దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం
- ప్రస్తుతం 41 వేల మంది కార్మికులతో కొనసాగుతున్న పనులు



అమరావతి- సూర్య వాస్తవం
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి

- మిగతా 22లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి




## ఆ 45 ఎకరాలు ఎక్కడ?

- ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో రీ సర్వే చేయాలి
- కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల రెవెన్యూ రికార్డులను సబ్మిట్ చేయాలని నోటీసులు ఇవ్వాలి
- సర్వే నంబర్ 325లో ఉన్న భూమిని అర్హులైన పేదలకు పంచాలి
- తెలంగాణ అమరవీరుల కుటుంబాల కోసం కాలనీ నిర్మించాలి: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్ - సూర్య వాస్తవం
సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవలి, శివారు వెంకటాపురం గ్రామాల భూముల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. రెండు గ్రామల్లో సర్వే వివరాలను సీఎం రేవంత్‌రెడ్డికి అధికారులు వివరించారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ

- మిగతా 3లో..

## సుప్రీం జడ్జిగా అపరేశ్ సింగ్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ సునీతా అగర్వాల్ నియామకంతో సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య మూడుకు చేరింది. సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో ఈ నియామకాలు జరిగాయి. ఈ ముగ్గురి రాకతో సుప్రీం కోర్టులో ప్రస్తుతం సేవలందిస్తున్న మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరింది. సుప్రీంకోర్టు సవరణ చట్టం ప్రకారం సీజేఐతో కలిపి సుప్రీంకోర్టులో మంజూరైన మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 38 కాగా, కేవలం ఒకే ఒక్క పోస్టు ఖాళీగా ఉంది.

## ‘ఒక దేశం-ఒక ఎన్నిక’.. ఓ కుట్ర

ముంబై - సూర్య వాస్తవం

సర్ ప్రక్రియ విషయంలో ఎన్నికల సంఘం, బీజేపీ, కేంద్ర ప్రభుత్వంపై కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ నినాదం అయిన ‘ఒక దేశం- ఒక ఎన్నిక’.. అనేది ఓ కుట్ర అని విమ ర్శించారు. ‘ఒక దేశం- ఒక రాజకీయ పార్టీ’ అనే ఎజెండా దీని వెనుక ఉన్నదని విమర్శించారు. మంగళవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ సిటీలో దీప్కే మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు రాజ్యాంగ(సవరణ) బిల్లు-2024ను, దానికి జతగా కేంద్ర పాలిత ప్రాంతాల(సవరణ) బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ బిల్లులు పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలనలో ఉన్నాయి. మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ ముంబై కేంద్రం గా ఆందోళనలు చేసిన కాక్రోచ్ నేతలు, కార్యకర్తలకు మహారాష్ట్ర పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. దీనిపై దీప్కే స్పందిస్తూ.. తాము ఈ నెల 10వ తేదీన ఢిల్లీ జంతర్‌మంతర్‌లో తలపెట్టిన భారీ ధర్నాకు ఆటంకాలు కల్పించడంలో భాగంగానే నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. పోలీసుల చర్యను ‘నియంతృత్వ పోకడ’గా దుయ్యబట్టారు. ఢిల్లీకి వెళ్లవద్దు అని, ప్రయాణానికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయంటూ తమ కార్యకర్తలను పోలీసులు బెదిరిస్తున్నారని విమర్శించారు.

## ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు..

(మొదటిపేజీ తరువాయి)

సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

## ఆ 45 ఎకరాలు ఎక్కడ?

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలోని సర్వే నెంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూ మి ఉండగా, రెవెన్యూ అధికారుల సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లుగా గుర్తించారు. ఆ సర్వే నెంబర్‌లో 45 ఎకరాలు మిస్ అయినట్లుగా అధికారులు గుర్తించారు. మిస్ అయిన 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయితే భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని సూచించారు. భూమి సరిహద్దులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు సబ్మిట్ చేయాలని అధికారులు నోటీసు లు జారీచేయనున్నారు. సర్వే నంబర్ 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సర్వే నంబర్ 325లో తెలంగాణలో ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం తెలంగాణ అమరవీ రుల కాలనీ నిర్మాణం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ అమరవీరుల కాలనీలో అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి సకల సౌకర్యాలతో జూన్ 2లోగా కాలనీ నిర్మాణం పూర్తిచేయాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాలన్నారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినియోగించే వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## కడప అభివృద్ధిపై చర్చకు సిద్ధం..

### - గొడ్డలి పార్టీ అధినేతకు సీఎం చంద్రబాబు సవాల్

కడప - సూర్య వాస్తవం

గొడ్డలి పార్టీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని.. ఈ విధ్వంసాన్ని సరిచేస్తామని ఎన్నికల ముందు చెప్పామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు(సోమవారం) జిల్లాలో పర్యటించిన సీఎం, డిప్యూటీ సీఎం పవన్.. జల్‌జీవన్ మిషన్ 2.0-అమరజీవి జలధార పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ 3.0ను చేపట్టామన్నారు. మదనపల్లె హార్టికల్చర్ హబ్‌తో రాయలసీమ దశ-దిశ మారబోతోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టించే బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. కర్మయోగి ద్వారా ప్రతి ఉద్యోగిలో నైపుణ్యం పెంచుతామని వెల్లడించారు. పాన్ ఐఐటీ ద్వారా టెక్నాలజీని తదుపరి దశకు తీసుకెళ్తామని.. పాన్ ఐఐటీ కౌన్సిల్ అమరావతిలో ఏర్పాటు కాబోతుందని తెలిపారు.

కడప అభివృద్ధిపై చర్చకు సిద్ధం అంటూ గొడ్డలి పార్టీ అధినేతకు ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. కేంద్రం నుంచి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లు తీసుకుందని.. ఏపీ కంటే చిన్న రాష్ట్రం అసోం రూ.34వేల కోట్లు తీసుకుందని తెలిపారు. గతంలో ఉన్న ప్రభుత్వం కేవలం రూ.2,016 కోట్లు తీసుకుందని.. గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్ అంటూ విరుచుకుపడ్డారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం తన కోరిక అని చెప్పుకొచ్చారు. కరవు సమయంలోనూ 2వేల టీఎంసీలు సముద్రం పాలయ్యాయన్నారు. నదుల అనుసంధానంతో 4 రాష్ట్రాలకు సాగునీటి కష్టాలు తొలగుతాయని తెలిపారు. లిక్కర్ స్కాంలో అంతిమ లబ్ధిదారు గొడ్డలి పార్టీ అధినేత అని వేళ్లు చూపిస్తున్నాయని చంద్రబాబు అన్నారు. సమాధానం చెప్పే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. వాళ్లు నేరాలు చేసి ఎదుటివారిపై ఆరోపణలు చేస్తారని మండిపడ్డారు. కుట్రలే గొడ్డలి పార్టీ సిద్ధాంతమన్నారు. వివేకా హత్య కేసులో వాస్తవాలన్నీ బయటకు వచ్చాయన్నారు. వివేకా హత్య కేసులో వాస్తవాలు కక్కిస్తామని స్పష్టంచేశారు. గత ప్రభుత్వంలో గ్రూప్1లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ‘నేను 2019 సీఎంను కాదు.. 4.0 సీఎంని’ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# ఢిల్లీలో హైటెన్షన్








(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్ భవనం నుంచి ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇండి కూటమి ఎంపీల ర్యాలీ మొదలు కాగా, నీతి ఆయోగ్ కార్యాలయం సమీపంలోకి రాగానే పోలీసులు అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో విపక్ష ఎంపీలు అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ.. సేవ్ డెమోక్రసీ బ్యానర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ వినూత్న నిరసనతో అందరి దృష్టిని ఆకర్షించారు. అక్కడున్న స్టీల్ బ్యారికేడ్‌లపైకి ఎక్కి నిలబడి త్రివర్ణ పతాకం ఊపుతూ నిరసన తెలిపారు.

విపక్ష ఎంపీలను బలవంతంగా అదుపులోకి తీసుకుని తరలిస్తుండగా ఇండియా కూటమి ఎంపీలు, యూత్ కాంగ్రెస్ శ్రేణులు బస్సులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో అక్కడ తోపులాట, తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాహుల్ గాంధీ, ప్రియాంక పోలీసుల వలయాన్ని దాటుకుని ఆల్ ఇండియా రేడియో (ఆకాశవాణి కార్యాలయం) భవన ప్రాంగణంలోకి దూసుకుపోయారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లనీయాలని పట్టుబట్టారు. అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి చెట్టు కింద కూర్చున్నారు.

తమవెంట మొబైల్ టాయిలెట్లను సైతం తెచ్చుకున్నామని ప్రకటించారు. తమ నేతలు కూర్చునేందుకు, తినేందుకు చాపలు, తినుబండారాలను కార్యకర్తలు తెచ్చి ఇచ్చారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ సహా నిరసనకు దిగిన ఎంపీల్లో చాలా మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, అక్కడి నుంచి బస్సుల్లో తరలించారు. ఆ తర్వాత విడిచి పెట్టగా.. వారందరూ మధ్యాహ్నానికి తిరిగి నిరసనలో వచ్చి చేరారు. రాహుల్, ప్రియాంకతోపాటు కాంగ్రెస్ ఎంపీలు ఆకాశవాణి భవనాన్ని వీడలేదు. దీంతో చివరికి 9 గంటల తర్వాత పోలీసులు రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్ సహా ఇతర ఎంపీలను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రాత్రి 10 గంటల తర్వాత వారిని విడుదల చేశారు. ఈ నిరసన మార్చ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, టీఎంసీ నుంచి అభిషేక్ బెనర్జీ, ఎన్సీపీ (శరద్ పవార్) నుంచి సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) సంజయ్ రౌత్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా సహా ఇండియా కూటమి ప్రముఖ నేతలు హాజరయ్యారు. అయితే, ఈ నిరసనకు ఇండియా బ్లాక్‌లో భాగమైన ఆప్, డీఎంకే ఎంపీలు దూరంగా ఉండగా.. కూటమిలో లేని బిజూ జనతాదళ్ (బీజేడీ) ఎంపీలు పాల్గొని మద్దతు పలికారు. మల్లికార్జున ఖర్గే కొద్దిసేపటికే అనారోగ్యానికి గురికావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి, వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, ఆర్.రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, బలరాం నాయక్ తదితరులు చురుగ్గా పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫామ్‌లో చూపించే కటౌట్లను ప్రతిపక్ష ఎంపీలు ప్రదర్శించారు. ఇండియా కూటమి మార్చ్ నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీని పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యాలయం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను దారి మళ్లించారు. “సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సాయంతో ఓటు చోరీ ద్వారా ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఈ దేశాన్ని హైజాక్ చేశారు. ఇది ముమ్మాటికీ దేశద్రోహమే” అని రాహుల్ ధ్వజమెత్తారు. వీరెవరూ చట్టం నుంచి తప్పించుకోలేరని, భవిష్యత్తులో అందరిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. “కోట్లాది మంది ప్రజలకు మేము ప్రాతినిధ్యం వహిస్తున్నాము. ఎంపీలను ఎన్నికల కమిషనర్లను కలవనివ్వకపతే, ఇక ప్రజాస్వామ్యానికి అర్థమేముంది”అని రాహుల్ ప్రశ్నించారు. తర్వాత ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై చేసిన పోస్టులో ‘జ్ఞానేశ్ ఇక చాలు. రాజీనామా చేయడానికి ఇదే సరైన సమయం’ అని రాహుల్ పేర్కొన్నారు. ఈ మార్చ్‌లో 300 మందికిపైగా విపక్ష ఎంపీలు పాల్గొన్నట్లు ప్రకటించారు. “జ్ఞానేశ్ కుమార్... మోదీ, షాల చేతిలో కేవలం కీలుబొమ్మ మాత్రమే.

ఓట్ల దొంగతనంలో జ్ఞానేశ్ కుమార్‌కు పాఠాలు నేర్పింది ఆ పెద్ద దొంగలే” అంటూ ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విపక్షాల నిరసనపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు దేశంలో అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించింది. కష్టపడకుండానే రాహుల్ గాంధీని మరోసారి రాజకీయంగా పైకి తీసుకురావడానికి (రీలాంచ్ చేయడానికి) విఫలయత్నాలు చేస్తున్నాయని విమర్శించింది. ఎన్నికల్లో వరుస పరాజయాలపై తమ అసంతృప్తిని విపక్ష ఎంపీలు ఈ రూపంలో వ్యక్తం చేసున్నారని, రాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు.

**అపాయింట్‌మెంట్ అడగలేదు: ఈసీఐ**

ఏ రాజకీయ పార్టీ కూడా అధికారికంగా తమ అపాయింట్‌మెంట్ కోరలేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాజకీయ పార్టీలతో భేటీల కోసం 2025లోనే ఈసీఐ ఒక స్పష్టమైన విధివిధానాన్ని (ప్రక్రియను) రూపొందించిందని గుర్తు చేసింది. దీని ప్రకారం.. ఏ పార్టీ లేదా కూటమి నేతలైనా సంఘాన్ని కలవాలంటే, తమ అధికారిక ప్రతినిధి ద్వారా ముందుగా సమయం కోరాలని.. ఇరువర్గాల అంగీకారంతో నిర్ణయించిన సమయంలో భేటీ జరగడం ఆనవాయితీ అని స్పష్టం చేసింది.




# చిక్కుల్లో ఈసీ

(మొదటిపేజీ తరువాయి)

ఆన్‌లైన్ వర్షన్‌లో ఈసీ యాడ్ చేసిన డిక్లరేషన్ అంశం ఎటు దారితీస్తుందన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఫారం-6లో మార్పులకు తమ ఆమోదం లేదని, అవి ఎవరు చేశారో తేలుస్తామని, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ఉంటే కొట్టేస్తా మని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఎలాంటి మార్పులు తాము చేయలేదని ఈసీ చెప్తున్నప్పటికీ.. ఫారం సెల్ఫ్ డిక్లరేషన్ యాడ్ చేయడం అనేది సవరణగానే ప్రతిపక్షాలు అంటున్నాయి. వచ్చే వారం మళ్లీ సుప్రీంకోర్టు విచారణ చేపట్టనున్నందున ఏం జరుగుతుందన్నది ఉత్కంఠకు దారితీసింది.

కొత్తగా ఓటు నమోదు చేయించుకునేవాళ్లు ఫారం-6లో తమ వయసు, నివాస వంటి నామమాత్రపు ధృవీకరణలు సమర్పిస్తే సరిపోతుంది. అయితే.. సర్ ప్రక్రియ లో భాగంగా ఈసీ దీనికి అదనంగా సెల్ఫ్ డిక్లరేషన్‌ను ఆన్‌లైన్‌లో పెట్టింది. ఇందులో ‘2002 ఓటరు జాబితాలో మీ పేరు ఉందా?’ అని ఓ ప్రశ్న ‘మీ పేరు లేకుంటే మీ అమ్మానాన్న, రక్తసంబంధీకుల పేర్లు ఉన్నాయా?’ అని మరో ప్రశ్న ఉంచింది. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ‘తప్పనిసరి కాదు’ అంటూ ఈసీ చెప్తున్నప్పటికీ.. వాటిని పూర్తి చేయకుండా ఫారం-6 సబ్మిట్ చేయలేని విధంగా ఆన్‌లైన్ వర్షన్ రూపొందించారు. దీని వల్ల లక్షల మంది యువ ఓటర్లు ఓటు హక్కు కోల్పోయారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పైగా, ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ‘సర్’ ప్రక్రియ నిర్ణయాలు తీసుకున్నారని, ఫారం మార్పులు చేశారని వారు అన్నట్లు కథనాలు వచ్చాయి. దీంతో ప్రతిపక్షాలు ఆందోళన బాటపట్టాయి. సీఈసీ జ్ఞానేశ్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఓటర్లను తొలగించడమే పనిగా సర్‌ను చేపడుతున్నారని మండిపడుతున్నాయి. ఆయనను తొల గించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. అయి తే.. ఇటీవల ఈసీ ఓ ప్రకటన విడుదల చేసిం ది. ఉమ్మడి నిర్ణయాల మేరకే సర్ ప్రక్రియ చేపడుతున్నామని, మార్పులు చేర్పులకు సుప్రీంకోర్టు అనుమతి ఉందని చెప్పింది. ఈ పరిణామాల నేపథ్యంలో సుప్రీంకోర్టులో ప లు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సు ప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూ ర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారించి.. మార్పులకు తమ ఆమో దం లేదని స్పష్టంచేసింది. అవసరమైన ఏకాభిప్రాయం లేదా మెజారిటీ లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు తేలితే వాటిని రద్దు చేసే అవకాశం కూడా ఉందని తేల్చిచెపింది.

**సీఈసీ జ్ఞానేశ్‌పై చర్యలు తప్పవా?**

ఫారం-6లో తాము ఎలాంటి మార్పు లు చేయలేదని, సర్ ప్రక్రియ కోసం తగిన డాక్యుమెంటేషన్ విధానాన్ని రూపొందించుకునే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంటుం దని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఆ ప్రకారమే అదనంగా డిక్లరేషన్ యాడ్ చేశామని, అది తప్పనిసరి కూడా చేయలేదని ఈసీ చెప్తున్నది. అయితే.. ఫారం-6కు డిక్లరేషన్ యాడ్ చేయడమే చట్టవిరుద్ధమని, ఆన్‌లైన్ ఫారం-6ను సబ్మిట్ చేయాలంటే డిక్లరేషన్ పూర్తి చేస్తే కాని ముందుకు వెళ్లడం లేదని ప్రతిపక్షాలు అంటున్నాయి. పేరుకు తప్పనిసరి కాదంటున్నప్పటికీ అది పూర్తి చేస్తే కానీ సబ్మిట్ కాకపోవడం అంటే ‘తప్పనిసరి’ అన్నట్లు కాదా.. అని ప్రశ్నిస్తున్నాయి. ఈ పరిణామ క్రమంలో సుప్రీంకోర్టు కూడా మార్పుల అంశాన్ని ప్రస్తావించడం ‘సర్’ అంశం మరింత వివాదానికి దారితీసింది. రికార్డులను అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రికార్డులను పరిశీలించిన తర్వాత సుప్రీంకోర్టు ఏం చెప్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఏకపక్ష నిర్ణయం తీసుకు న్నట్లు రికార్డులను బట్టి తేలితే సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై మరింత ఒత్తిడి పెరుగుతుంది. ఆయనను విధుల నుంచి తొలగించేలా మ ధ్యంత ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌ను సుప్రీంకోర్టు పక్కనబెట్టినప్పటికీ.. రికార్డులు పరిశీలించాకే ఏ నిర్ణయమైనా వెల్లడిస్తామనడంతో, తదుపరి విచారణలో జ్ఞానేశ్‌కుమార్ భవితవ్యం ఏమిటన్నది చర్చకు దారితీసింది.

## సంపాదకీయం

# ఆందోళన కల్గిస్తున్న యువకుల మరణాలు




ఇటీవల కాలంలో పురుషుల మరణాలు పెద్ద సంఖ్యలో చోటు చేసుకుంటున్నాయని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. మహిళలతో పోలిస్తే పురుషుల మరణాలు ఆందోళనకర రీతిలో పెరుగుతున్నట్టు పేర్కొంది. ముఖ్యంగా 15 నుంచి 64 ఏళ్ల మధ్య వయసు గల పనిచేసే, కుటుంబాలను పోషించే వయస్సు ఉన్న పురుషులలో ఈ తేడా అత్యంత తీవ్రంగా ఉందని తెలిపింది. నివేదిక ప్రకారం.. తమిళనాడులో గతేడాది నమోదైన మొత్తం మరణాల్లో 4,01,860 పురుషులు కాగా, 2,91,347 మహిళలు ఉన్నారు. మహిళల కంటే పురుషుల మరణాలు ఏకంగా 1,10,513 ఎక్కువ. గత మడేళ్లుగా పురుషులు, మహిళల మరణాల మధ్య వ్యత్యాసం లక్షకు పైగానే ఉండటం గమనార్హం. 2023లో 1.10 లక్షలు, 2024లో 1.07 లక్షలు, 2025లో 1.11 లక్షలు.వీరిలో దాదాపు 86 శాతం (94,792 మరణాలు) తమ జీవితంలో అత్యంత కీలకమైన ఉత్పాదక దశలో ఉన్నవారే కావడం మరింత ఆందోళనకరం. ప్రజారోగ్య శాఖ డైరెక్టరేట్ ఓ మెడికల్ జర్నల్‌లో ప్రచురించిన 2018-2022 మధ్య పౌర నమోదు వ్యవస్థ డేటా విశ్లేషణ ప్రకారం.. ప్రతి జిల్లాలో 15 ఏళ్ల వయస్సు దాటినవారిలో మహిళల కంటే పురుషుల మరణాలే ఎక్కువగా ఉన్నాయని తేలింది.నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ టి. సుందరరామన్ మాట్లాడుతూ.. ఈ గణాంకాలు కేవలం జనాభాకు సంబంధించినవి మాత్రమే కాదని అన్నారు. "చాలా చిన్న వయసులో కుటుంబాలు తండ్రులను కోల్పోతున్నాయి. మహిళలు వితంతువులవుతున్నారు. యువత జీవితాలను కాపాడటానికి మనం పెట్టుబడులు పెట్టాలి" అని ఆయన అన్నారు.గతేడాది 15 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 9,167 మంది, మహిళలు 4,461 మంది ప్రాణాలు కోల్పోయారు. 25 - 34 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 17,135, మహిళలు 6,177.. 35 - 44 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 31,585, మహిళలు 11,406 మంది, 45 - 54 ఏళ్ల మధ్య మహిళల కంటే పురుషుల మరణాల సంఖ్య 28,474 ఎక్కువ. 55 - 64 ఏళ్లలో మహిళల కంటే 30,475 మరణాలు ఎక్కువ కాగా.. 70 ఏళ్లు దాటిన తర్వాత ఈ వ్యత్యాసం తగ్గింది. పురుషులు 1,55,093 మంది చనిపోతే.. మహిళలు 1,50,545 మంది ప్రాణాలు కోల్పోయారు.ప్రజా ఆరోగ్య నిపుణుల విశ్లేషణ ప్రకారం పురుషుల మరణాలకు యువతలో ప్రమాదాలు, ఆత్మహత్యలు: రోజుకు సగటున 50 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లోనూ, అంతే సంఖ్యలో ఆత్మహత్యల వల్ల మరణిస్తున్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం, మధుమేహం, శ్వాసకోశ వ్యాధులు, అలాగే పొగాకు, మద్యం వాడకం వల్ల వచ్చే తీవ్ర అనారోగ్యాలు.మహిళలకు గర్భధారణ, ప్రసవానంతరం ఆరోగ్య పరీక్షలు క్రమంగా జరుగుతాయి. కానీ చాలామంది పురుషులు 40 ఏళ్లు వచ్చే వరకు ఎలాంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం లేదు. తమిళనాడులో నమోదైన మొత్తం 6,93,207 మరణాలలో కేవలం 2,80,856 మరణాలు (41%) మాత్రమే వైద్యపరంగా ధ్రువీకరించనవి. పురుషుల మరణాలలో 42%, మహిళల మరణాలలో 38% మాత్రమే మెడికల్ సర్టిఫికేషన్ పొందాయి.ఆ రాష్ట్రంలో ప్రతి 10 మరణాల్లో 6 ఆసుపత్రుల వెలుపలే జరుగుతున్నాయి. ఆసుపత్రుల బయట జరిగే మరణాలకు గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి 'వెర్బల్ అటాప్సీ' వంటి విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.స్వీడన్‌లో 2025లో 46,000 మంది పురుషులు, 46,200 మంది మహిళలు మరణించారు. అక్కడ మరణాల సంఖ్య ఇరు వర్గాల్లో దాదాపు సమానంగా ఉన్నప్పటికీ, స్వీడన్‌లో కేవలం 10% మరణాలు మాత్రమే 65 ఏళ్ల వయస్సు కంటే ముందు జరుగుతాయి. అదే మన దేశంలో అయితే 42% మరణాలు 65 ఏళ్ల కన్నా ముందే సంభవిస్తున్నాయి.దీర్ఘకాలిక వ్యాధులు, రోగాలను గుర్తించేందుకు ఇంటి వద్దకే వైద్య సేవలు, నిర్మాణ కార్మికులకు హెల్త్ చెకప్‌లు అందిస్తున్నారు. కూలీ కోల్పోతామనే భయంతో పగటిపూట ఆసుపత్రులకు రాని పురుషుల కోసం సాయంత్రం వేళల్లో క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ఇక్కడ బీపీ, షుగర్ తనిఖీలు చేస్తున్నారు. ఉపాధి కోసం ద్విచక్రవాహనాలపై ప్రయాణించే పురుషుల భద్రత దృష్ట్యా రోడ్డు భద్రతా చర్యలను తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉంది. పురుషుల అకాల మరణాలను నివారించడం అనేది కేవలం వారి ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, అది కుటుంబ ఆర్థిక భద్రతకు. మహిళలు, పిల్లల భవిష్యత్తుకు రక్షణ అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి బయట అంబులెన్స్ దందా..

# నియంత్రించేది ఎవరు?

- బెంగళూరుకు రూ.9 వేల నుంచి రూ.9,500 వరకు వసూలు చేస్తున్నారంటున్న రోగుల బంధువులు
- బయట నుంచి తక్కువ ఛార్జీకి అంబులెన్స్ పిలిపిస్తే అడ్డుకుంటున్నారంటూ ఆరోపణలు
- ప్రైవేటు అంబులెన్సులు కావడంతో తమ పరిధిలో లేదంటున్న సూపరింటెండెంట్
- పోలీస్ శాఖ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని రోగుల కుటుంబాల విజ్ఞప్తి




**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం ప్రత్యేక కథనం :** అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద అంబులెన్స్ ఛార్జీల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పేద, మధ్యతరగతి కుటుంబాలు అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు రోగులను తరలించాల్సి వచ్చినప్పుడు అంబులెన్స్ నిర్వాహకులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారంటూ రోగుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను మెరుగైన వైద్యం కోసం బెంగళూరు, కర్నూలు తదితర ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ సమయంలో ఆసుపత్రి బయట అందుబాటులో ఉండే అంబులెన్సును సంప్రదిస్తే బెంగళూరుకు వెళ్లేందుకు సుమారు రూ.9,000 నుంచి రూ.9,500 వరకు ఛార్జీ చెబుతున్నారని ఆరోపిస్తున్నారు.అదే సమయంలో ఆసుపత్రికి బయట నుంచి మరో అంబులెన్స్‌ను సంప్రదిస్తే రూ.6,000 నుంచి రూ.6,500 మధ్యలో బెంగళూరుకు తీసుకెళ్లేందుకు సిద్ధ పడుతున్నారని రోగుల బంధువులు చెబుతున్నారు. దీంతో తక్కువ ఛార్జీకి వచ్చే అంబులెన్స్‌లను ఆసుపత్రి వద్దకు రానివ్వకుండా అడ్డుకుంటున్నారంటూ కొందరు రోగుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.ప్రైవేటు అంబులెన్సులు.. మా పరిధిలో లేదు ఈ విషయంపై ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరలక్ష్మిని వివరణ కోరగా.. ఆసుపత్రి బయట ఉన్న అంబులెన్సులు ప్రైవేటు వాహనాలని, వాటి ఛార్జీలను నియంత్రించడం లేదా వాటిపై చర్యలు తీసుకోవడం తమ పరిధిలో లేదని తెలిపారు.అయితే అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఉన్న రోగుల నుంచి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖలు స్పందించాల్సిన అవసరం ఉందని రోగుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అంబులెన్స్ సేవల పేరుతో పేద కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



**స్ట్రెచర్లు, వీల్‌చైర్లపైనా వివరణ**

ఇదిలా ఉండగా.. ఇటీవల దాతలు అందించిన స్ట్రెచర్లు, వీల్‌చైర్లు స్టోర్‌రూమ్‌లోనే ఉన్నాయంటూ వచ్చిన వార్తలపై కూడా సూపరింటెండెంట్ వివరణ ఇచ్చారు.దాతలు అందించిన స్ట్రెచర్లు, వీల్‌చైర్లు ఆసుపత్రికి చేరిన అనంతరం వివిధ విభాగాలకు ఎన్ని అవసరమో తెలియజేయాలని ఆయా విభాగాలకు ఇంటెంట్ కోరినట్లు తెలిపారు. అనంతరం విభాగాల అవసరాలను మరోసారి పరిశీలించి, అవసరానికి అనుగుణంగా వాటిని పంపిణీ చేసినట్లు వివరించారు. అయితే పంపిణీ ప్రక్రియ పూర్తికాకముందే స్టోర్‌రూమ్‌లో ఉన్న సామగ్రిని ఎవరో ఫొటోలు తీసి మీడియాకు అందించారని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కూడా వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు.అంబులెన్స్ ఛార్జీలపై వస్తున్న ఫిర్యాదులు, తక్కువ ఛార్జీకి వచ్చే అంబులెన్స్‌లను అడ్డుకుంటున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని రోగుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ముఖ్యంగా అత్యవసర సమయంలో రోగులను తరలించేందుకు ఇబ్బందులు లేకుండా, అంబులెన్స్ సేవలు పారదర్శకంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎన్నికల భద్రతకు పటిష్ట చర్యలు

- క్షేత్రస్థాయిలో పోలీసుల విస్తృత పరిశీలన
- ఎన్నికల నేపథ్యంలో వార్డులు, గ్రామాల్లో పోలీసుల క్షేత్రస్థాయి పర్యటనలు
- సమస్యాత్మక వ్యక్తులు,అనుమానితులు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా.
- పోలింగ్ కేంద్రాల భద్రతా పరిస్థితులపై ప్రత్యక్ష పరిశీలన.
- ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని వార్డులు, గ్రామాలను సందర్శించి సమస్యాత్మక వ్యక్తులు, అనుమానితులు, రౌడీషీటర్లు, గతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులు తదితరులపై అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వారి కదలికలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పోలీసు అధికారులు స్వయంగా సందర్శించి భద్రతా పరిస్థితులను పరిశీలిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలు,ఓటర్ల రాకపోకలు,ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు తదితర అంశాలపై సమాచారాన్ని సేకరించి,అవసరమైన చోట్ల అదనపు భద్రతా చర్యలకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనల్లో భాగంగా పోలీసులు ప్రజలతో నేరుగా మాట్లాడి ఎన్నికల సమయంలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ఎన్ని కల ప్రక్రియకు విఘాతం కలిగించే విధంగా బెదిరింపులు,గొడవలు,అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర అవాంఛనీయ చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో నగదు,మద్యం, మాదకద్రవ్యాలు లేదా ఇతర ప్రలోభాల పంపిణీ, ఓటర్లను బెదిరించడం, అక్రమంగా గుంపులు ఏర్పాటు చేయడం, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు గమనించిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండి, ప్రజాస్వామ్య ప్రక్రియలో బాధ్యతాయుతంగా పాల్గొనాలని పోలీసు అధికారులు సూచించారు.ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా,నిష్పక్షపాత వాతావరణంలో జరిగేలా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ శాఖ అన్ని అవసరమైన భద్రతా చర్యలను నిరంతరం చేపడుతోందని తెలిపారు.



# వర్షాల కోసం... పెన్నాహోబిలంలో వరుణ యాగం...!

- సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు
- పాడిపంటలు సమృద్ధిగా పండాలని స్వామివారిని వేడుకున్న అర్చకులు, భక్తులు





**ఉరవకొండ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నాహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం వరుణ యాగం, వరుణ జపం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ముందుగా ఆలయంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పెన్నా నది వద్దకు చేరుకుని శాస్త్రోక్తంగా వరుణ యాగం, వరుణ జపం నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ రేగటి నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.ప్రధాన అర్చకులు ఎ.ఎన్.ద్వారకనాథాచార్యులు, అర్చకులు ఎం. బాలాజీ, గుండురావు వేద మంత్రో చ్ఛారణల మధ్య వరుణ దేవునికి ప్రత్యేక పూజలు, యాగ కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నారు.కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చంద్ర మౌళి స్వామి, దేవేంద్ర, దేవస్థాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## స్కూల్ చైర్మన్‌లను సత్కరించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం ఆర్ అండ్ బి బంగ్లాలో ఇటీవల గుత్తి మండలంలో స్కూల్ ఛైర్మన్లుగా ఎన్నికైన అభ్యర్థులకు సన్మాన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుత్తి, పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ స్కూల్ ఛైర్మన్లుగా ఎన్నికైన అభ్యర్థులకు గుమ్మనూరు ఈశ్వర్ శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించి ఎన్టీఆర్ చిత్రపటాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ స్కూల్ ఛైర్మన్ ఎన్నికల్లో విజయం సాధించిన మీ అందరికీ హృద యపూర్వక శుభాకాంక్షలు అని తెలియజేశారు. అదే విధంగా స్కూలు అభివృద్ధి కొరకు అహర్నిశలు పనిచేసి స్కూలుకు మంచి పేరు తీ సుకురావాలని విద్యార్థుల ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుత్తి మండల, పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు స్కూల్ ఛైర్మన్లు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

## కళ్యాణదుర్గం నూతన డీఎస్పీగా టి.దైవ ప్రసాద్

**- ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** కళ్యాణదుర్గం సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన టి.దైవ ప్రసాద్ మంగళ వారం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌లో పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంపై ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి దిశానిర్దేశం చేశారు.

## నిబంధనలు ఉల్లంఘించిన ముబారక్ క్లినిక్ సీజ్

**- హిందూపురంలో ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లపై ఆరోగ్యశాఖ ఇన్ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు**
**- నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించి చర్యలు**
**- అక్రమ వైద్య సేవలపై నిరంతర తనిఖీలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి**

**హిందూపురం వైద్యం - సూర్య వాస్తవం :** హిందూపురం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లపై ఆరోగ్యశాఖ ఇన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించిన ముబారక్ క్లినిక్‌ను అధికారులు సీజ్ చేశారు. ప్రైవేట్ వైద్య సంస్థల్లో నిబంధనల అమలుపై అధికారులు దృష్టి సారించడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో కొన్ని ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చినప్పటికీ చర్యలు ఆలస్యమయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అధికారులు తనిఖీలు నిర్వహించి క్లినిక్‌ను సీజ్ చేయడంపై పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.సీజ్ చేసిన క్లినిక్‌ను తిరిగి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య సేవల పేరుతో నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు రుజువైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




# వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం...

**- అభివృద్ధిని చూసి ప్రజలు ఓటేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి...**
**- కూటమి అభ్యర్థులు గెలిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది...**
**- అభివృద్ధికి పట్టం కట్టాలంటూ ...**
**- రాయదుర్గం ప్రజలకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి**



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాయదుర్గం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం పట్టణంలోని 17,21వ వార్డుల్లో పూర్తి అయిన సీసీ రోడ్డులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అలాగే 17వ వార్డులో సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రాయదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పునఃప్రారంభించడంతో పాటు వేగవంతం చేశామన్నారు. రాయదుర్గం పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణ ప్రధాన రహదారితో పాటు ప్రతి వార్డులో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణంలోని ఏవార్డుకు వెళ్లినా ప్రజలు తమను నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. రాయదుర్గంలో జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని వార్డుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అలాగే రాయదుర్గం మున్సిపల్ చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధికి మద్దతుగా నిలిచి, రాయదుర్గం పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, వార్డు ఇంఛార్జిలు కరెన్న, పైతోట రామాంజనేయులు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ చేనేత డైరెక్టర్ టశీకశాల హనుమంతు, సుమలత, సంపత్ కుమారి, ప్రశాంతి, ఉమ, పద్మ, బళ్లారి జ్యోతి, బండి భారతి, లావణ్య, అగ్రహారం కిరణ్,భలే శంకర్, వై.వెంకటేశులు, కావలి రవి,,వేణు, పోరాళ్ల ధనర్జున, కొండాపురం శ్రీనివాసులు, ఆనంద్, ఎల్లప్ప, రావుత్ రాజశేకర్, తదితరులు పాల్గొన్నారు.



# పార్టీలకు అతీతంగా రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు...

**- ప్రజాధరణకు నిదర్శనం కాపు జన్మదిన వేడుకలు?**
**- భారీ గజమాలతో కాపును సన్మానించిన అభిమానులు..**



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** నిత్యం ప్రజల్లో ఉండే ప్రజా నాయకుడిగా పార్టీలతో పనిలేదని మరోసారి రుజువైంది రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రాయలసీమ జోన్ జనతా వారధి ఇన్చార్జ్ కాపు రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా పార్టీలకు అతీతంగా నిర్వహించారు. డి హీరేహాళ్ మండల పరిధిలోని హిర్దేహాల్ కాపు రామచంద్రారెడ్డి వ్యవసాయ తోటలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో 1964 అక్టోబర్ 06 జన్మించిన కాపు రామచంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా అభిమానులు కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేశారు ఆయనకు శుభాకాంక్షలు తెలపడానికి ఉదయం నుండే అన్ని పార్టీల నాయకులు ప్రజలు యువకులు బారులు తీశారు బిజెపి శ్రేణులే కాకుండా వైసిపి ఇతర పార్టీలకు చెందిన నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు వివిధ కుల సంఘాల పెద్దలు స్వయంగా హాజరై రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొనడం రాజకీయంగా చర్చగా



మారింది. బళ్లారి పట్టణంలోని ఆయన నివాసం ఆయన వ్యక్తిగత కార్యాలయంలో జన సందోహంతో నెలకొనడం విశేషంగా మారింది.

**రాయలసీమలో బిజెపికి బలం**

ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడిగా, ఓబిసి మోర్చ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా, జనతా వారధి రాయలసీమ జోన్ ఇన్చార్జిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాయదుర్గం మున్సిపాలిటీలో బిజెపి బలంగా ఉందని చెప్పడానికి ఈ జన్మ దిన వేడుకలకు వచ్చిన జనమే నిదర్శనమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.

**2029కి సంకేతమా?**

రాయదుర్గం నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గంతో పాటు అన్ని వర్గాల్లో ఆయనకు ఉన్న పట్టు ఇలాంటి వేడుకల్లో బయట పడుతుందని నిత్యం ప్రజల కోసం పాటుపడే నాయకుడుగా ఆయనకు ఉన్న పేరు కూటమి ప్రభుత్వంలో బిజెపికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా భవిష్యత్తులో రాయదుర్గం రాజకీయాల్లో ఆయన పాత్ర మరింత కీలకంగా కానుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా కాపు రామచంద్రారెడ్డి జన్మదిన వేడుక పార్టీ కార్యక్రమమంతా కాకుండా ఒక ప్రజా ఉత్సవంలో జరగడం, అన్ని పార్టీల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడం రాయదుర్గం రాజకీయాల్లో కాపు రామచంద్రారెడ్డి ప్రజాధరణ కు అద్దం పడుతుంది. పార్టీలకు అతీతంగా ప్రజలు పాల్గొని రాజకీయంగా కాపు రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు చర్చనీయాంశంగా మారింది.

# పదవులు కన్నా శాశ్వతమైన ప్రజాసేవ ముఖ్యం...

**- కూటమి అభివృద్ధిని చూసి వైసిపి ఓర్వలేక అబద్ధ ప్రచారాలు...**
**- మన మార్క్ పాలన శాశ్వతంగా గుర్తుండి పోవాలి.**
**- వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచన**



**రాయదుర్గం- సూర్య వాస్తవం :** పదవులు కేవలం అలంకా రప్రాయంగా మిగిలిపోకూడదని, తాము పని చేసిన కాలంలో రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టి తమ మార్క్ శాశ్వతంగా గుర్తుండిపోయేలా పని చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులకు సూచించారు. రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డులో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై వెళ్తున్న గ్రేడ్-2 కార్యదర్శి శ్రీనివాసులును మంగళవారం మార్కెట్ యార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలవ ఘనంగా సన్మానించారు. అనంతరం మార్కెట్ యార్డు అధికారులు, కమిటీ సభ్యులతో కలిసి యార్డు అభివృద్ధి, రైతులకు అందుతున్న సేవలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హనుమంతరెడ్డి నాయకత్వంలో రాయదుర్గం మార్కెట్ యార్డు సేవలు క్రమంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. మార్కెట్ యార్డు అనుబంధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కనేకల్లులో సబ్ మార్కెట్ ఏర్పాటుకు తాను మంత్రిగా ఉన్న సమయంలో ఎంపిక చేసిన స్థలంలో ప్రస్తుతం రూ.60 లక్షలతో గోడౌన్ నిర్మాణంతో పాటు రహదారి సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాయదుర్గానికి తాజాగా రైతు బజార్ మంజూరు చేయించామని, త్వరలోనే భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రైతు బజార్ ప్రతి మార్కెట్ యార్డుకు మణికిరీటం లాంటిదని అభివర్ణించారు. రైతు బజార్ ద్వారా ప్రతిరోజూ వందలాది మంది రైతులకు సేవలు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా రైతు బజార్‌కు తీసుకువచ్చి వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గి రైతులకు తమ ఉత్పత్తులకు మెరుగైన ధర లభించడంతో పాటు వినియోగదారులకు కూడా నాణ్యమైన నిత్యావసర వస్తువులు తక్కువ ధరకే అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం రైతు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసే ఉత్పత్తులు మధ్యవర్తులు, హోల్‌సేల్ వ్యాపారులు, చిల్లర వర్తకుల చేతులు మారే క్రమంలో వినియోగదారుడికి అధిక ధరకు చేరుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు తన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కకపోగా, మధ్యవర్తులే అధికంగా లాభపడుతున్నారని అన్నారు. రైతు బజార్ ఏర్పాటు ద్వారా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే వెసులుబాటు కలుగుతుందని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతు బజార్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చిన వారవుతారని సూచించారు. రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా మార్కెట్ యార్డు సేవలను విస్తరించేందుకు కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. పదవిలో ఉన్న కాలంలో రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టి తమ సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవాలని కాలవ శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ధానవేంద్ర,కమిటీ సభ్యులు అంబోజి రావ్,నాగిరెడ్డిపల్లి హనుమంతు, చాంద్ బాషా, మాదిగ ఆనంద్, గుద్దిటి లావణ్య, శాలి బాయి, గొల్ల నిర్మల తదితరులు పాల్గొన్నారు.



# ఒకే సర్వే నంబర్ భూమికి ఎంతమందికి పట్టాలు?

- ఒకరికి ఇచ్చిన డీ-పట్టాను మళ్లీ నలుగురికి ఎలా ఇచ్చారు?
- సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలి: ఎస్సీ, ఎస్టీ జేఏసీ



**బెళుగుప్ప - సూర్య వాస్తవం:** ఒకే సర్వే నంబర్‌లోని భూమికి పలువురి పేర్లపై డీ-పట్టాలు మంజూరు చేసిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బెళుగుప్ప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.మండలంలోని గంగవరం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 354/1లో 5 ఎకరాల 4 సెంట్ల భూమిని దళితుడైన సవారప్పకు 1978లో ప్రభుత్వం ఊఖు పట్టా నంబర్ 170/88 ద్వారా మంజూరు చేసిందని జేఏసీ నేత చెలిమప్ప తెలిపారు. అయితే అదే సర్వే నంబర్ లోని అదే భూమిని మరో నలుగురికి డీ-పట్టాలుగా ఎలా మంజూరు చేశారో విచారణ జరపాలని కోరారు. 1978 నుంచి ఇప్పటి వరకు సదరు భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో ఎన్ని మార్పులు, చేర్పులు జరిగాయి? ఎవరి పేర్లపై మార్పులు చేశారు? ఏ అధికారుల హయాంలో ఈ ప్రక్రియ జరిగింది? అనే వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. అసలైన లబ్ధిదారు సవారప్ప కుటుంబ సభ్యులు న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ఇదే సమయంలో భూమి రికార్డుల్లో మార్పులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఒకే సర్వే నంబర్ లోని భూమికి ఎంతమందికి పట్టాలు ఇచ్చారో అధికారులు స్పష్టం చేయాలని కోరారు.ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులు, మధ్యవర్తుల పాత్రపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. అసలైన లబ్ధిదారుడైన సవారప్ప కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై తక్షణమే విచారణ చేపట్టి నిజానిజాలు వెల్లడించకపోతే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, జేఏసీ నాయకులు మధు, నాగార్జున, శివరాజ్, సురేష్, గంగన్న, తిమ్మప్ప, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వైద్య సేవలపై జిల్లా వైద్యఅధికారి ఆకస్మిక తనిఖీ





**గుత్తి -సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలోని మాతృశ్రీ ఆసుపత్రి ( కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ను ఎన్టీఆర్ జిల్లా సమన్వయ వైద్య అధికారి డాక్టర్ కె.గంగాధరరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అమలు తీరును పరిశీలించారు.ప్రతి కాన్పుకేసును ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద నమోదు చేయాలని, అలాగే రోడ్డు ప్రమాద కేసులతో పాటు పథకం పరిధిలోకి వచ్చే అన్ని కేసులకు ఉచిత వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.అనంతరం చికిత్స పొందుతున్న అపెండిసైటిస్ రోగి లక్ష్మీనారాయణమ్మను పరామర్శించి, వైద్యం ఉచితంగా అందుతోందా? వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది సక్రమంగా సేవలు అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. రోగి సంతృప్తి వ్యక్తం చేయడంతో జిల్లా సమన్వయ వైద్యఅధికారి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవమిత్ర బోయబాబు, శశికుమారి,ఆసుపత్రి సిబ్బంది రోగులు తదితరులు పాల్గొన్నారు.

# యాప్ మొరాయింపు.. రైతులకు తిప్పలు..

- విత్తనాల కోసం గంటల తరబడి నిరీక్షణ...



**కనేకల్ - సూర్య వాస్తవం:** పప్పుశనగ విత్తనాల కోసం వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చిన రైతులకు యాప్ సాంకేతిక సమస్యలు తిప్పలు తెచ్చిపెట్టాయి. విత్తనాల కోసం నమోదు చేసుకునేందుకు వచ్చిన రైతులు యాప్ సక్రమంగా పనిచేయక పోవడంతో గంటల తరబడి కార్యాలయం వద్ద వేచి ఉండాల్సి వచ్చింది.సర్వర్ సమస్యలు, సాంకేతిక లోపాల కారణంగా విత్తనాల నమోదు ప్రక్రియ ముందుకు సాగడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికే సాగు పనులకు సిద్ధమైన రైతులు విత్తనాల కోసం కార్యాలయానికి వచ్చి నిరీక్షించాల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మరోవైపు విత్తనాల నమోదులో జాప్యం జరిగితే పొలాల్లో ఉన్న తేమ ఆరిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో పప్పుశనగ విత్తనాలు అందకపోతే సాగు పనులు ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. యాప్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పప్పుశనగ విత్తనాలను సకాలంలో అందించాలని రైతులు అధికారులను కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు రైతులకు తెలిపారు.

# గ్రామీణ ఆరోగ్యానికి ఊతం..
# 29 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ప్రారంభం...!

- అనంతపురం జిల్లాలో 29 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు శ్రీకారం
- పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి ప్రాథమిక వైద్య సేవలు
- ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తాం : ఎంపీ అంబికా



**అనంతపురం వైద్య - సూర్య వాస్తవం :** అనంతపురం గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు అనంతపురం జిల్లాలో 29 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (విలేజ్ హెల్త్ క్లినిక్‌లు) ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 267 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో భాగంగా వీటిని ఏర్పాటు చేశారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ క్లినిక్‌ల శిలాఫలకాలను ఆవిష్కరించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గుడివాడ నుంచి వర్చువల్‌గా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య మందిరాలు ప్రజలకు తక్షణ ప్రాథమిక వైద్య సేవలు అందించే కేంద్రాలుగా ఉపయోగ పడతాయని ఎంపీ తెలిపారు. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, నిపుణులైన వైద్యుల నియామకానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. క్లినిక్‌లకు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు అంకితభావంతో సేవలందించాలని వైద్య సిబ్బందిని కోరారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో అత్యవసర మందులతో పాటు బీపీ, షుగర్, సాధారణ రక్త పరీక్షలు తదితర 14 రకాల ప్రాథమిక పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వైసీ సుబ్బరాయుడు, ఈఈ రాజన్న, డీఈ లక్ష్మీనారాయణ, ఎన్‌హెచ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మలేరియా అధికారి డాక్టర్ మనోజ్ కుమార్, డీఐపీఆర్వో బాలకొండయ్య, జిల్లా మాస్ మీడియా అధికారి ఈ.నాగరాజు, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మంచినీటి కోసం 13 కి.మీ పాదయాత్ర

- ట్యాంక్ నిర్మించి ఏడాది దాటినా.. కాలనీలకు నీళ్లు ఏవీ?
- వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీవో హామీ



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం రాజీవ్ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శిల్పారామం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు 13 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆర్డబ్ల్యూఎస్ ఏఈకి వినతిపత్రం అందజేసి, ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సీపీఎం పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి, రాజీవ్ కాలనీ మాజీ ఉపసర్పంచ్ మసూద్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుడు వీరనారప్ప మాట్లాడుతూ.. రాజీవ్ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజల మంచినీటి అవసరాల కోసం నేషనల్ పార్క్ శిల్పారామంలో రూ.1.78 కోట్లతో స్టోరేజ్ ట్యాంక్ నిర్మించి ఏడాది దాటినా కాలనీలకు నీటిని విడుదల చేయలేదని ఆరోపించారు. సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని అన్నారు.పీఏబీఆర్ నుంచి మంచినీటిని తీసుకొచ్చేందుకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు పూర్తి కాలేదని విమర్శించారు. ప్రజాధనం ఖర్చు చేస్తున్నా ప్రజలకు ఉపయోగం లేకుండా పోతోందని, పాలకులు, అధికారులు సమస్యపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.మహదేవ్‌నగర్, నేతాజీనగర్, భగత్‌సింగ్‌నగర్, ప్రియాంకనగర్, గణేనాయక్‌నగర్, రామయ్య కాలనీల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు.అదే విధంగా రాజీవ్ కాలనీ మెయిన్ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.67 లక్షలు మంజూరు చేసినా పనులు పూర్తికాలేదని, రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

**వారం రోజుల్లో నీటి సమస్య పరిష్కారం:**

ధర్నా సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వారం రోజుల్లో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజీవ్ కాలనీ మెయిన్ రోడ్డు పనులకు గతంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వి.బి. రామ్‌జీ పథకాన్ని తీసుకు రావడంతో ఆ నిధులు నిలిచిపోయాయని తెలిపారు. పై అధికారులతో మాట్లాడి ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు పనులను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, ఇర్ఫాన్, వలి, నగర కమిటీ సభ్యులు వెంకట, ఎన్టీఆర్ శీను, రాజు, గఫూర్, డేవిడ్, రాము, శీను, వన్నూర్, కుమారి, లత, పద్మావతి, బాబు, వెంకటేష్, శంకర తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సిబ్బందిపై చర్యలు..
# దివ్యాంగుల సీట్లకు ప్రత్యేక నోటీసులు

- ఆర్ఎం సమక్షంలో క్షమాపణలు చెప్పినా వెనక్కి తగ్గని దివ్యాంగ సంఘాల నాయకులు
- ఫిర్యాదుపై స్పందించిన ఆర్టీసీ అధికారులు.. ఒక డ్రైవర్ తొలగింపు, ఇద్దరు సస్పెన్షన్
- ప్రతి బస్సులో దివ్యాంగులకు కేటాయించిన సీట్లు వారికే కేటాయించాలని డిమాండ్



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం దివ్యాంగుల పట్ల అనుచితంగా వ్యవహరించిన ఆర్టీసీ సిబ్బందిపై చర్యలు తీసు కోవాలని కోరుతూ దివ్యాంగ సంఘాల నాయకులు చేపట్టిన ఆందోళనకు స్పందన లభించింది. దివ్యాంగులకు కేటాయించిన సీట్లను వారికే కేటాయించేలా ప్రతి ఆర్టీసీ బస్సులో స్పష్టమైన నోటీసులు ఏర్పాటు చేయాలని కోరుతూ గత నెల 19న డీఎంను కలిసేందుకు డిపోకు వెళ్లిన దివ్యాంగ సంఘాల నాయకులను కొందరు సిబ్బంది దూషించారని ఆరోపిస్తూ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ఆర్‌ఎంకు ఫిర్యాదు చేశారు.ఈ నేపథ్యంలో మంగళవారం ఆర్‌ఎం కార్యాలయంలో ఆర్‌ఎం సమక్షంలో బంగారప్ప అనే సిబ్బంది దివ్యాంగ సంఘాల నాయకులకు క్షమాపణలు చెప్పారు. అయితే అనిల్‌కుమార్, మాధవయ్య, ఈశ్వరయ్య తదితరులు క్షమాపణలు చెప్పేందుకు హాజరు కాలేదని నాయకులు తెలిపారు. దీంతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎంను కోరారు.దీనిపై స్పందించిన ఆర్‌ఎం.. తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు మాధవయ్య, బంగారప్ప అనే డ్రైవర్లను సస్పెండ్ చేసినట్లు నాయకులు తెలిపారు.అలాగే అనంతపురం జిల్లాలోని ప్రతి ఆర్టీసీ బస్సులో దివ్యాంగులకు కేటాయించిన సీట్లను వారికే కేటాయించేలా నోటీసులు ఏర్పాటు చేయాలని, దివ్యాంగులు బస్సులో ఎక్కినప్పుడు వారికి సీట్లు కేటాయించే బాధ్యతను కండక్టర్లు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది.ఈ కార్యక్రమంలో ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, జిల్లా కార్యదర్శి సెల్ఫునిషా, కదిరి నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యనారాయణచారి, ఉపాధ్యక్షుడు మంజునాథ్, ఉరవకొండ నియోజకవర్గ అధ్యక్షుడు అల్లావుద్దీన్, కార్యదర్శి రసూల్, ఆంజనేయులు, శివన్నతో పాటు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్, జిల్లా కార్యదర్శి రాజేష్, కళ్యాణదుర్గం నియోజకవర్గ అధ్యక్షుడు దొనస్వామి తదితరులు పాల్గొన్నారు.



# కడసారి చూపు కోసం వెళ్తూ.. కానరాని లోకాలకు!

**- రోడ్డు ప్రమాదంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం**







**నాయుడుపేట- సూర్య వాస్తవం:** తెలిసిన వారు మృతి చెందిన విషయం తెలుసుకుని వారిని కడసారి చూసేందుకు బయలుదేరిన ఓ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మ రణం పాలైన ఘటన నేలబల్లి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.వివరాల్లోకి వెళితే.. నేలబల్లి గ్రామానికి చెందిన గోను ప్రసన్న కుమార్ అలియాస్ నందబాబు (54) ఆంధ్రప్రదేశ్ పోలీస్ 9వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వెంకటగిరి డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న నందబాబు.. తనకు తెలిసిన వారు మృతి చెందిన విషయం తెలుసుకుని వారిని కడసారి చూసేందుకు డక్కిలి నుంచి వెంకటగిరి వైపు కారులో బయలుదేరినట్లు బంధుమిత్రులు తెలిపారు. ఈ క్రమంలో డక్కిలి మండలం నాగవోలు గ్రామ సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న ఏపీ 40 సీసీ 4166 కారు లారీని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో నందబాబు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.తెలిసిన వ్యక్తులను కడసారి చూసేందుకు బయలుదేరిన నందబాబు.. తానే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న ఆయన ఆకస్మిక మరణంతో నేలబల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నందబాబుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సెంటర్ లైట్ల తాత్కాలిక కనెక్షన్లతో భద్రతకు ముప్పు

**- భారీ వాహనాల రాకపోకలతో వైర్లు తెగిపడి.. ట్రాఫిక్‌కు అంతరాయం**







**నాయుడుపేట-సూర్య వాస్తవం:** పట్టణంలోని బస్టా ండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో సెంటర్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు ప్రమాదకరంగా మారాయి. రహదారిపై తిరిగి ఉన్న విద్యుత్ వైర్లు భారీ వాహనాలు యూటర్న్ చేసే సమయంలో వాటికి తగిలి తెగిపడుతున్నాయి. విద్యుత్ సరఫరా ఉన్న వైర్లు రోడ్డుపై వేలాడటం, తెగిపడటం వల్ల షార్ట్ సర్క్యూట్‌తో పాటు విద్యుత్ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో వైర్లు వాహనాలకు అడ్డుగా మారడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. సెంటర్ లైట్లు పనిచేయకపోవడంపై సూర్య వాస్తవంలో కథనం ప్రచురించడంతో మున్సిపల్ సిబ్బంది స్పందించి తాత్కాలిక కనెక్షన్లు ఏర్పాటు చేసి లైట్లను పునరుద్ధరించారు. అయితే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వైర్లు వాహనాల రాకపోకలకు అనుగుణంగా లేకపోవడంతో సమస్య మళ్లీ తలెత్తుతోంది. ప్రజలు, వాహనదారుల భద్రత దృష్ట్యా తెగిపోయిన వైర్లను వెంటనే తొలగించి, సెంటర్ లైట్లకు శాశ్వత విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి, వైర్లను సురక్షితంగా అమర్చాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం చోటుచేసుకునే లోపే అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నెలబల్లి పాఠశాలలో వన్యప్రాణి వారోత్సవాలు

**- అడవులను రక్షిద్దాం... వన్యప్రాణులకు రక్షణ కల్పిద్దాం**







**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** వన్యప్రాణులైన పక్షి జాతులతో పాటు, అడవుల్లో సంచరించే ప్రతి జంతువుకు రక్షణ కల్పించాలని నేలపట్టు పక్షుల కేంద్రం సిబ్బంది సోమవారం మండల పరిధిలోని నెలబల్లి ఎంపీయుపి పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు ఫారెస్ట్ సిబ్బంది కలిసి ముందుగా ర్యాలీ నిర్వహించారు. అక్టోబర్ నెల రెండవ తేదీ నుండి 8 వరకు వన్యప్రాణుల వారోత్సవాలు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు రామయ్య మాట్లాడుతూ విశ్వంలో పక్షులు వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలిపారు.అదేవిధంగా అడవులను రక్షించడం, వన్యప్రాణులను వేటాడి చంపకుండా,ప్రతి ఒక్కరూ కాపాడాలని తెలియ జేశారు. విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటు కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ బాలయ్య, గైడ్ హుస్సేన్, ఫారెస్ట్ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట అభివృద్ధికి ముఖ్యమంత్రి దృష్టికి కీలక అంశాలు

**- అభివృద్ధి పనులపై సీఎంతో ఎమ్మెల్యే విజయశ్రీ భేటీ**
**- కాళంగి హైలెవల్ బ్రిడ్జికి అనుమతులు, నిధులు కోరిన విజయశ్రీ**
**- కాళంగిపై నాలుగు వరుసల వంతెనకు ప్రతిపాదన**
**- అనుమతులు, నిధులు మంజూరు చేయాలని చంద్రబాబుకు ఎమ్మెల్యే విజ్ఞప్తి**





**నాయుడుపేట- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సూళ్లూరుపేట పట్టణంలోని కాళంగి నదిపై నాలుగు వరుసల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. మంగళవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీ, మాజీ ఎంపీ,ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి ఎమ్మెల్యే విజయశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులకు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.సూళ్లూరుపేట పట్టణంలోని కాళంగి నదిపై ప్రస్తుతం ఉన్న రాకపోకల అవసరాలకు అనుగుణంగా నాలుగు వరుసల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం అవసరమని ఎమ్మెల్యే వివరించారు. ఈ వంతెన నిర్మాణానికి సంబంధించిన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయడంతో పాటు, పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులను కేటాయించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ప్రజల అవసరాలకు సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు. కాళంగి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు, నిధుల మంజూరుపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిం చినట్లు ఎమ్మెల్యే విజయశ్రీ వెల్లడించారు.

# సూళ్లూరుపేట టోల్ ప్లాజాలో హౌస్ కీపింగ్ కార్మికుడు మృతి..

**- గ్రామస్తులు నిరసన- చేసేది హౌస్ కీపింగ్... యాజమాన్యం చేయించేది మరెన్నో పనులు**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** కలకత్తా-చెన్నై జాతీయ రహదారి, దొరవారిసత్రం మండల పరిధిలోని తల్లంపాడు టోల్ ప్లాజాలో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికుడు అపస్మారక స్థితిలో పడి మృతి చెందాడు. వివరాల మేరకు తల్లంపాడు గ్రామ పంచాయతీలోని గిరిజన కాలనీలో కాపురముంటున్న తుపాకుల.చదవరయ్య (40)గత రెండేళ్లుగా టోల్గేట్‌లో హౌస్ కీపింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం టోల్ ప్లాజా యాజమాన్యం ఆయనకు అప్పగించిన పనికి బదులు సిమెంట్ కాంక్రీట్ పనికి పంపడంతో సిమెంట్, ఇసుక కలుపుతుండగా ఒక్కసారిగా ముందుకు పడి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. వెంటనే వైద్యం కొరకు సూళ్లూరుపేటకు తరలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటన తెలుసుకున్న కుటుంబ సభ్యులు టోల్ ప్లాజా వద్దకు చేరుకుని యాజమాన్యంతో వాదనకు దిగారు. మీ నిర్వాకం వలనే మా కాలనీవాసి మృతి చెందాడని నిరసనకు దిగారు. హౌస్ కీపింగ్ పనిచేయాల్సిన వ్యక్తిని కష్టతరమైన సిమెంట్ కాంక్రీట్ సంబంధంలేని పనికి పంపడంతోనే నా భర్త చనిపోయాడని, దీనికి బాధ్యులైన టోల్ ప్లాజా నిర్వాహకులపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. నిరుపేదలైన చదవరయ్య కుటుంబానికి పెద్ద దిక్కు,కుటుంబ పోషకుడు చనిపోవడంతో ఆ గ్రామ స్తులంతా టోల్ ప్లాజా వద్ద చేరుకొని ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై దొరవారిసత్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నారు. అయితే టోల్గేట్ యాజమాన్యం అతనికి హౌస్ కీపింగ్ పని అప్పగించకపోగా సిమెంట్ పనిని అప్పగించడంతో ఇసుక సిమెంట్ కలుపుతూ ఉండగా ఎండ తీవ్రతకు సుహతప్పి కోల్పోవడంతో మృతి చెందాడని తెలుపుతున్నారు. రాత్రి 8 గంటలైనా మృతుడు బంధువులు తన మృతదేహాన్ని టోల్ ప్లాజా యాజమాన్యం కార్యాలయం వద్ద ఉంచి నిరసన తెలియజేస్తున్న యాజ మాన్యం మాత్రం ఇప్పటికీ పట్టించుకోలేదు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ఆ గిరిజన కుటుంబానికి న్యాయం చేకూర్చాలని పలువురు ప్రాధేయపడుతున్నారు.

# ప్రాథమిక స్థాయిలోనే రోగాన్ని గుర్తించి నాణ్యమైన వైద్యం అందించాలి

**- ఆరోగ్యకరమైన కుటుంబం-ఆరోగ్యకరమైన సమాజం**
**-సంపూర్ణ ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణమే మా సంకల్పం**
**- మంత్రి సత్య కుమార్ యాదవ్**





**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** ప్రాథమిక స్థాయిలోని రోగాన్ని గుర్తించి గ్రామంలోని నాణ్యమైన వైద్యం అందించడం ఆరోగ్యకరమైన కుటుంబం ఆరోగ్యకరమైన సమాజం సంపూర్ణ ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణమే మహా సంకల్పం అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆయన మంగళవారం కృష్ణా జిల్లా, గుడివాడ నియోజకవర్గంలోని జనార్దనా పురం (జొన్నపాడు) గ్రామం నుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 267 నూతన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (గ్రామీణ ఆరోగ్య కేంద్రాల) భవనాలను ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా గ్రామస్తులు పట్నాలకు పరుగులు తీసే పనిలేకుండా పక్కా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం.24 జిల్లాలు, 87 నియోజకవర్గాల్లో సుమారు రూ 104.96 కోట్ల వ్యయంతో ఈ కేంద్రాల నిర్మాణం. ప్రతి కేంద్రంలో 105 రకాల అత్యవసర మందులు,14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు, 71 రకాల వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాయి. ప్రాథమిక స్థాయి లోనే రోగాన్ని గుర్తించి, గ్రామంలోనే నాణ్యమైన వైద్యం అందించడం. ఆరోగ్యకరమైన కుటుంబం --ఆరోగ్యకరమైన సమాజం--సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే మా సంకల్పం.అని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.

# భక్తుల సౌకర్యమే ప్రధమ ప్రాధాన్యత

**- వారి భద్రతే ప్రధాన బాధ్యత అనే లక్ష్యంతో పనిచేయాలి**
**- దసరా మహోత్సవాలలో అన్ని శాఖల వారు సమన్వయంతో పనిచేయాలి :మంత్రి సత్య కుమార్**





**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** భక్తుల సౌకర్యాన్ని ప్రధాన ప్రాధాన్యత వారి భద్రతే ప్రధాన బాధ్యత అనే లక్ష్యంతో దసరా మహోత్సవాల్లో అన్ని శాఖల వారి సమన్వయంతో పని చేయాలి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆయన మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 11 నుంచి 20 వరకు వైభవంగా జరగనున్న దసరా మహోత్సవాల ఏర్పాట్లపై సహచర మంత్రులు శ్రీ అనం రామనారాయణ శ్రీమతి అనిత వంగళపూడి కోళ్ల రవీంద్ర లతో కలిసి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తరఫున ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించాము. దాదాపు 25 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున దర్శనం, క్యూలైన్లు, అన్నప్రసాదం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం, పటిష్ట భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమగ్రంగా సమీక్షించామన్నారు. భక్తుల సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత -- వారి భద్రతే ప్రధాన బాధ్యత అనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

## శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం....

**- సీఐ ఎం.మురళీకృష్ణ ఆధ్వర్యంలో "కార్డన్ అండ్ సెర్చ్"**

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు నాయుడుపేట డీఎస్పీ జి.చెంచుబాబు నేతృత్వంలో సూళ్ళూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన భారీ "కార్డన్ అండ్ సెర్చ్"ఆపరేషన్ విజయవంతమైంది. ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా సీఐ ఎం.మురళీకృష్ణ ముమ్మర తనిఖీలు చేపట్టారు. రానున్న స్థానిక ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని ముందస్తు అప్రమత్తత చర్యగా,ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు,ఘర్షణలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఈ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు సూళ్ళూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో 25 మంది పోలీస్ సిబ్బందితో పాటు నలుగురు ఎస్సైలు సూళ్ళూరుపేట ఎస్సై జి.అజయ్ కుమార్, దొరవారిసత్రం ఎస్సై జి.వి.చౌదరి, తడ ఎస్సై కె.కొండప్పనాయుడు, శ్రీహరికోట ఎస్సై భానుప్రసన్నలతో కూడిన ప్రత్యేక బలగాలు ఇందిరానగర్ కాలనీని పూర్తిగా చుట్టుముట్టి జల్లెడ పట్టాయి. ప్రతి ఇల్లు, వీధి, అనుమా నాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 12 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఎం.మురళీకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, వాడకంపై సీఐ ఎం.మురళీకృష్ణ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.గంజాయి మహమ్మారిని ఉపేక్షించేది లేదని, దాని నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొంటూ ఆయన ఒక కీలక ప్రకటన చేశారు ?గంజాయి విక్రయిస్తున్న వారిపై సరైన సమాచారం అందించిన వారికి రూ.2,000 నగదు బహుమానం, అలాగే గంజాయి సేవిస్తున్న వారి వివరాలు తెలిపిన వారికి రూ.500 నగదు బహుమానం అందజేస్తామని సీఐ ఎం.మురళీకృష్ణ వెల్లడించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు, వివరాలు అత్యంత రహస్యంగా ఉంచుతామని,వారి భద్రతకు పూర్తి బాధ్యత వహిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.ప్రజా సంక్షేమం, ప్రశాంత వాతా వరణం నెలకొల్పడమే పోలీసుల ముఖ్య ప్రాధాన్యమని, నేరరహిత సమాజ నిర్మాణం కోసం ప్రజలందరూ పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని సీఐ ఎం.మురళీకృష్ణ పిలుపునిచ్చారు.





# ఆదర్శ కుటుంబంతో వాళ్లకి ఇబ్బందే!

బాక్సాఫీస్ వద్ద సినిమాల విడుదల తేదీల మార్పులు, సర్దుబాట్లు పరిశ్రమలో ఎప్పటికప్పుడు చర్చకు దారితీస్తుంటుంది. పెద్ద సినిమా విడుదల తేదీ మారితే? ఆ ప్రభావం నేరుగా అదే సమయానికి షెడ్యూల్ అయిన ఇతర చిత్రాలపై పడుతుంది. తాజాగా -ఆదర్శ కుటుంబం- సినిమా విడుదల తేదీపై జరుగుతున్న ప్రచారాలు టాలీవుడ్‌లో కొత్త చర్చకు తెరలేపాయి. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 30కి వాయిదా పడితే? ఆ తేదీన ఇప్పటికే క్యూలో ఉన్న యంగ్ హీరోల సినిమాలకు గట్టి పోటీ తప్పదు. ప్రస్తుతం టాలీవుడ్‌లో యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్లు, వైవిధ్యమైన కథలతో వస్తున్న సినిమాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 30వ తేదీని లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే పలువురు యంగ్ హీరోలు తమ చిత్రాల విడుదలను ఖరారు చేసుకున్నారు. మాస్ అండ్ క్లాస్ అప్పీల్‌తో దూసుకెళ్తున్న విశ్వక్సేన్(కల్ట్), విభిన్న కథా పాత్రలతో ప్రేక్షకులను అలరించే రోషన్ మేకా(ఏమో ఏమో ఇది), అలాగే యంగ్ హీరో అనీష్‌ల( ఇట్లు అర్జున సోల్ ఆఫ్ అర్జున) సినిమాలు ఇదే తేదీకి రిలీజ్ కి రెడీ అవుతున్నాయి. ఇలాంటి సమయంలో -ఆదర్శ కుటుంబం- లాంటి క్రేజీ ప్రాజెక్ట్ అకస్మాత్తుగా అక్టోబర్ 30




రేసులోకి వస్తే పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. థియేటర్ల కేటాయింపు నుంచి కలెక్షన్ల వరకు అన్ని రంగాలపై ఈ మార్పు తీవ్ర ప్రభావం చూపుతుంది. పెద్ద సినిమాలకు సాధారణంగానే ఎక్కువ థియేటర్లు దక్కుతాయి. కాబట్టి అదే రోజు విడుదల కావాల్సిన చిన్న, మధ్య తరహా చిత్రాలకు థియేటర్ల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఇది యంగ్ హీరోల నిర్మాతలకు ఆర్థికంగానూ ఆందోళన కలిగించే అంశమే.అయితే బాక్సాఫీస్ వద్ద ఇలాంటి క్లాషెస్ రావడం టాలీవుడ్‌కి కొత్తేమీ కాదు. పండుగ సీజన్లు కాకపోయినా? సాధారణ వారాంతాల్లోనూ రెండుమూడు సినిమాలు ఒకేసారి బరిలోకి దిగుతుంటాయి. కంటెంట్ బలంగా ఉంటే చిన్న సినిమా? పెద్ద సినిమా? అనే తేడా లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తారు అనడానికి చాలా ఉదాహరణలున్నాయి. అయినా? బిజినెస్ పరంగా, సోలో రిలీజ్ దక్కించుకోవాలనే ప్రణాళికల పరంగా యంగ్ హీరోల జంటలకు ఇది కొంత ఇబ్బందికరమైన పరిణామమే అవుతుంది. ఈ పోటీ థియేటర్ల సంఖ్యకే పరిమితం కాదు. బాక్సాఫీస్ కలెక్షన్లపై కూడా ప్రభావం చూపుతుంది. ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడానికి ప్రతి చిత్రం వినూత్న ప్రచార కార్యక్రమాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఒకే రోజు ఇన్ని సినిమాలు వస్తే ఓపెనింగ్స్ చీలిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఆయా చిత్రాల నిర్మాతలు, పంపిణీదారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. అంతిమంగా -ఆదర్శ కుటుంబం- వాయిదా పడితే మాత్రం అక్టోబర్ 30 బాక్సాఫీస్ పోరు రసవత్తరంగా మారడం ఖాయం. అనీష్, విశ్వక్సేన్, రోషన్ మేకా వంటి యువ నటుల సినిమాలు భారీ పోటీని ఎలా ఎదుర్కొంటాయి? ప్రేక్షకులు ఎవరి వైపు మొగ్గు చూపుతారు? అనేది ఆసక్తికరం.

# ట్రైలర్ టాక్ ఎలా ఉందంటే!

హీరో శ్రీవిష్ణు మరోసారి తనకు బాగా కలిసొచ్చిన కామెడీ జానర్‌లో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్ తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ట్రైలర్‌ను గమనిస్తే.. నక్సలిజం నేపథ్యాన్ని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. సీరియస్ బ్యాక్‌డ్రాప్‌కు శ్రీవిష్ణు స్టైల్ కామెడీ, సెటైరికల్ డైలాగ్స్‌ను జోడించడం సినిమాకు కొత్త ఫ్లేవర్‌ను తీసుకొచ్చింది. ట్రైలర్‌లో అక్కడక్కడా కనిపించిన బాలయ్య రిఫరెన్సులు, పంచ్ డైలాగ్స్, శ్రీవిష్ణు టైమింగ్ నవ్వులు పూయించేలా ఉన్నాయి. ముఖ్యంగా హీరో పాత్రను రూపొందించిన విధానం ఆయన గత చిత్రాల్లో కనిపించిన కామెడీ ఎంటర్‌టైనర్ షేడ్స్‌ను గుర్తు చేస్తోంది. సీరియస్ అంశాన్ని పూర్తిగా సీరియస్‌గా కాకుండా.. కామెడీ, సెటైర్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో మిక్స్ చేయడం 'కామ్రేడ్ కళ్యాణ్'లో ఆసక్తిని పెంచుతోంది.ట్రైలర్ చూస్తే కథ, పాత్రలు, నేపథ్యం విషయంలో దర్శకుడు కొత్తగా ఏదో ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. శ్రీవిష్ణు తనదైన కామెడీ టైమింగ్‌తో సినిమాను ఎంతవరకు నడిపిస్తారనేది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్ ఫన్, సెటైర్, మాస్ రిఫరెన్సులతో మంచి బజ్ క్రియేట్ చేస్తోంది.




సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.

## శారీలో తాప్సీ పన్ను..
# రాయల్ లుక్‌తో మతిపోగొట్టేసింది!



టాలెంటెడ్ బ్యూటీ తాప్సీ పన్ను తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. "ది గ్లో అండ్ ది గేజ్. ఆ చూపులు అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ ఆకట్టుకుంటుంది. సినిమాల పరంగా వరుస విజయాలు అందుకుంటూ, అటు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన శైలిలో దూసుకుపోతున్న ఈ భామ.. తాజాగా ఐవరీ షాంపైన్-గోల్డ్ శారీలో అచ్చం అప్సరసలా మెరిసిపోతూ కుర్రకారును కట్టిపడేస్తోంది.

ప్రస్తుతం ఈ అందమైన ఫోటోషూట్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.ఆ విశేషాలు చూద్దాం..సమాజం ఆలోచనలు ఎలా మారుతున్నాయి? ఐవరీ షాంపైన్-గోల్డ్ టిష్యూ ఆర్గాంజా శారీ లుక్: తాజా ఫోటోషూట్ కోసం తాప్సీ పన్ను ఎగసిపడే కెరటాల వంటి ప్రవాహంలాంటి ఐవరీ షాంపైన్-గోల్డ్ ప్యూర్ టిష్యూ ఆర్గాంజా చీరను ఎంచుకుంది. పల్లు మరియు అంచుల వెంబడి దట్టంగా అల్లిన మెరిసే గోల్డ్-ఎంబ్రాయిడరీ స్టేట్‌మెంట్ బార్డర్ ఈ చీరను మరింత రాయల్‌గా మార్చింది. ఇక దీనికి సరిగ్గా సరిపోయేలా స్ట్రాప్‌లెస్, హెవీగా ఎంబెర్నింగ్ చేసిన స్వీట్‌హార్ట్ కార్సెట్ చోలీ ధరించి అద్భుతమైన మోడ్రన్ టచ్ ఇచ్చింది. ఈ ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ ఫ్యూజన్ లుక్‌ను మరింత హైలైట్ చేయడానికి తాప్సీ ప్రత్యేకమైన ఆభరణాలను ఎంచుకుంది. భారీ ఎథ్నిక్ ఇయర్ రింగ్స్, చేతికి గోల్డ్ మ్యాచింగ్ బ్రాస్‌లెట్ అలాగే చేతిలో మెటాలిక్ గోల్డ్ క్లచ్ బ్యాగ్ ధరించి పర్ఫెక్ట్ రిచ్ లుక్‌లో కనిపించింది. ఇక ఆమె గ్లోయింగ్ మేకప్, కాన్ఫిడెంట్ లుక్ చూసి ఫిదా అయిన ఫ్యాన్స్ "ప్రిటీయెస్ట్", "గోర్జియస్", "ఎలిగెంట్ అండ్ క్లాసిసి బ్యూటీ", "లుకింగ్ నైస్లీ" అంటూ కామెంట్లతో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.'పింక్', 'థప్పడ్' నుంచి 'గాంధారి' వరకు ప్రయాణం : తమిళంలో 'ఆడుకలం', హిందీలో 'చష్మే బద్దూర్' చిత్రాలతో కెరీర్ ప్రారంభించిన తాప్సీ, 'బేబీ', 'పింక్' చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక 'థప్పడ్' చిత్రానికి ఉత్తమ నటిగా ఫిలింఫేర్ అవార్డు అందుకోవడంతో పాటు షారుఖ్ ఖాన్ సరసన 'డంకీ' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించింది. ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన ఆమె యాక్షన్-థ్రిల్లర్ 'గాంధారి' చిత్రంలో ఒక దృఢ సంకల్పం గల తల్లిగా నటించి అద్భుతమైన ప్రశంసలు అందుకుంది.'హార్పర్స్ బజార్' అవార్డు: నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అయిన 'గాంధారి' చిత్రం విడుదలైన తొలి మూడు వారాల్లోనే ఏకంగా 18.8 మిలియన్ల వ్యూస్ సాధించి సంచలనం సృష్టించింది. ఈ విజయాల జోరులో ఉన్న తాప్సీకి తాజాగా 'హార్పర్స్ బజార్ ఇండియా ఉమెన్ ఆఫ్ ది ఇయర్ -- 2026' పురస్కారం కూడా దక్కింది. త్వరలో 'వో లడ్కీ హై కహా?' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక నటనలో వైవిధ్యం చూపుతూనే, ఫ్యాషన్ ఐకాన్‌గా రాణిస్తున్న తాప్సీ పన్ను, రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులతో మరింత పెద్ద విజయాలు సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు.



## శ్రేయస్ శతక్కొట్టుడు..
# 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఊదేసిన టీమిండియా

వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విధ్వంసకర సెంచరీతో కదం తొక్కాడు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై, అయ్యర్ ఆడిన సుడిగాలి ఇన్నింగ్స్ ముందు వెస్టిండీస్ బౌలర్లు తేలిపోయారు. కేవలం 43 బంతుల్లోనే 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచిన అయ్యర్.. టీమిండియాకు అద్భుత విజయాన్ని అందించాడు. అతని బ్యాటింగ్ ధాటికి 172 పరుగుల లక్ష్యం చాలా చిన్నదిగా కనిపించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బ్యాటర్లలో షాయ్ హోప్ (52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (56) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో నమన్ ధిర్ 3




వికెట్లతో సత్తా చాటగా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (21), సంజూ శాంసన్ (11) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 35 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.ఈ క్లిష్ట దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. ఆట స్వరూపాన్నే మార్చేశాడు. వచ్చినప్పటి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతనికి ఇషాన్ కిషన్ (37 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. ఒకవైపు అయ్యర్ బౌండరీల వర్షం కురిపిస్తుండగా, మరో ఎండ్‌లో ఇషాన్ కిషన్ సంయమనంతో ఆడి వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు.

వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు కేవలం 67 బంతుల్లోనే 137 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయ్యర్ తన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చేశాడు. ఫలితంగా భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఘన విజయం సాధించింది. తమ ఇన్నింగ్స్ లో మరో 20 పరుగులు చేసుంటే బాగుండేదని విండీస్ భావించినప్పటికీ, అయ్యర్ బ్యాటింగ్ తీరు చూశాక మరో 60 పరుగులు చేసినా కరీబియన్లు గెలవలేరని స్పష్టమైంది.ఇక ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ ఈ నెల 9న రాంచీలో జరగనుంది.



# భారత మహిళల జట్టు కొత్త కెప్టెన్‌గా స్మృతి మంధాన

భారత మహిళా క్రికెట్ జట్టు నూతన సారథిగా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన నియమితురాలైంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం ప్రకటించింది. ఇప్పటివరకు కెప్టెన్‌గా ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవడంతో, ఆమె స్థానంలో వైట్-బాల్ క్రికెట్‌కు పూర్తిస్థాయి కెప్టెన్‌గా మంధాన బాధ్యతలు చేపట్టనుంది. 2013లో అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి జట్టులో కీలక సభ్యురాలిగా కొనసాగుతున్న స్మృతి మంధానకు సారథ్య బాధ్యతలు కొత్తేమీ కాదు. గతంలో ఆమె 18 టీ20లు, నాలుగు వన్డే మ్యాచ్‌లలో భారత జట్టును ముందుండి నడిపించింది. దేశీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ ఆమె తన నాయకత్వ పటిమను నిరూపించుకున్నారు. ముఖ్యంగా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును 2024, 2026 సంవత్సరాల్లో విజేతగా నిలిపి టైటిల్స్ అందించింది.తన నియామకంపై స్మృతి మంధాన స్పందిస్తూ, "భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం లభించడం ఒక ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నాను. నాపై నమ్మకం ఉంచిన బీసీసీఐ, సెలక్టర్లు, సహచర క్రీడాకారిణులు, నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ అందించిన విశేష సేవలను నేను గౌరవిస్తున్నాను. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి, భారత క్రికెట్‌ను మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు నా వంతు కృషి చేస్తాను" అని ఒక ప్రకటనలో పేర్కొంది.స్మృతి మంధాన నియామకంపై బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా హర్షం వ్యక్తం చేశారు. జట్టును విజయపథంలో నడిపించే సత్తా, అపార అనుభవం ఆమెకు ఉన్నాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. గౌహతిలో జరిగిన సమీక్షా సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న జింబాబ్వే సిరీస్‌తో స్మృతి మంధాన కెప్టెన్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించనుంది.

# ఫుట్‌బాల్ ఫ్రెండ్లీ మ్యాచ్: భారత్‌పై ఉరుగ్వే ఘన విజయం

అంతర్జాతీయ స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో భారత జట్టుకు భారీ ఓటమి ఎదురైంది. కోల్‌కతాలోని చారిత్రాత్మక వివేకానంద యువ భారతి క్రీడాంగణం (సాల్ట్ లేక్ స్టేడియం) వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బలమైన ఉరుగ్వే జట్టు 6-1 గోల్స్ తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. భారత ఆటగాడు అనిరుధ్ థాపా ఒక గోల్ చేసినప్పటికీ, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికి మాత్రమే ఉపయోగపడింది.మ్యాచ్ ఆరంభం నుంచే ఉరుగ్వే దూకుడు ప్రదర్శించింది. ఆట 11వ నిమిషంలోనే లభించిన పెనాల్టీని డార్విన్ నూనెజ్ గోల్‌గా మలిచి ఉరుగ్వేకు ఆధిక్యాన్ని అందించాడు. అయితే, సొంతగడ్డపై అభిమానుల మద్దతుతో ఆడుతున్న భారత జట్టు వెంటనే పుంజుకుంది. 21వ నిమిషంలో అనిరుధ్ థాపా అద్భుతమైన గోల్ సాధించి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో స్టేడియం ఒక్కసారిగా హోరెత్తింది.కానీ, ఈ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. 27వ నిమిషంలో మాక్సిమిలియానో అరౌజో గోల్ చేయడంతో ఉరుగ్వే మళ్లీ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది.



ప్రథమార్ధం ఇదే స్కోరుతో ముగిసింది.ద్వితీయార్ధం ప్రారంభమైన తర్వాత ఉరుగ్వే మరింత చెలరేగి ఆడింది. భారత రక్షణ శ్రేణిని ఛేదిస్తూ వరుస గోల్స్‌తో విరుచుకుపడింది. 52వ నిమిషంలో రొడ్రిగో జలజార్, 58వ నిమిషంలో మాక్సిమిలియానో అరౌజో తన రెండో గోల్, 70వ నిమిషంలో జువాన్ మాన్యువల్ సనాబ్రియా, 85వ నిమిషంలో రొడ్రిగో అగ్యుర్రే గోల్స్ సాధించడంతో ఉరుగ్వే భారీ విజయాన్ని ఖాయం చేసుకుంది.గణాంకాలను పరిశీలిస్తే, బంతిని 58% సమయం తమ ఆధీనంలో ఉంచుకున్న ఉరుగ్వే, గోల్ పోస్ట్‌పై 9 సార్లు కచ్చితమైన షాట్లు కొట్టింది. మరోవైపు, భారత్ 14 సార్లు గోల్ కోసం ప్రయత్నించినప్పటికీ, 5 షాట్లు మాత్రమే లక్ష్యం వైపు వెళ్లాయి. ప్రపంచ స్థాయి జట్టుతో ఆడిన ఈ మ్యాచ్, భారత జట్టుకు కీలకమైన పాఠాలను నేర్పిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కాగా, ఈ మ్యాచ్ లో స్కోరు 1-1తో సమంగా ఉన్న సమయంలో ఉరుములు, మెరుపులతో వాతావరణం మారిపోవడంతో మ్యాచ్ కు అంతరాయం కలిగింది. దాదాపు 34 నిమిషాల తర్వాత మ్యాచ్ మళ్లీ ప్రారంభమైంది. కొన్నిరోజుల కిందటే కోల్ కతాలో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్ లో భారత్.. ప్రపంచ అగ్రశేణి జట్టు బ్రెజిల్ చేతిలోనూ ఓటమిపాలవడం తెలిసిందే. నేడు ఉరుగ్వే మ్యాచ్ కోసం టికెట్ రేట్లను 90 శాతం వరకు తగ్గించినా, ఫ్రీ పాసులు ఇచ్చినా ప్రేక్షకులు లేక స్టేడియం వెలవెలపోవడం కనిపించింది.

## టీవీ టవర్ వద్ద...

# ఘోర రోడ్డు ప్రమాదం...!

- బైక్‌ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన పుట్టపర్తి ఆర్టీసీ బస్సు
- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- మరొకరికి తీవ్రంగా దెబ్బతిన్న కాలు.. ఆస్పత్రికి తరలింపు



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని టీవీ టవర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పుట్టపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు బైక్‌ను ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరో వ్యక్తి కాలు తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. ప్రమాదం అనంతరం క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై కోళ్లను తరలిస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో కొన్ని కోళ్లు కూడా మృతి చెందాయి. ఘటనతో రహదారిపై రక్తపు మరకలు కనిపించడంతో పాటు భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదాన్ని చూసిన స్థానికులు, వాహనదారులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న 108 అంబు లెన్స్ సుమారు 1.30 గంటల సమయంలో అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, క్షతగాత్రుల పరిస్థితిపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

# రెవెన్యూ అంశాలపై రాష్ట్రస్థాయి సమీక్ష

- రీ-సర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీపై దృష్టి
- 22-ఏ తొలగింపు కేసులు, పీజీఆర్ఎస్‌పై అధికారులకు ఆదేశాలు



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై రాష్ట్ర సీసీఎల్ఎ, స్పెషల్ సీఎస్ జయలక్ష్మి మంగళవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ-సర్వే పురోగతి, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, 22-ఏ తొలగింపు కేసులు, 6వ ప్రధాన కార్యదర్శుల సమావేశం, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఓ ఆనంద్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాల పురోగతిని రాష్ట్రస్థాయి అధికారులకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# మహిళలపై లైంగిక వేధింపులను సహించం

- పని ప్రదేశాల్లో చట్టం--2013ను పక్కాగా అమలు చేయాలి
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ




**భీమవరం - సూర్య వాస్తవం :** భీమవరం పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, లైంగిక వేధింపుల నిరోధక చట్టం--2013ను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కచ్చితంగా అమలు చేయాలని ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. మంగళ వారం భీమవరంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, అసంఘటిత రంగాల్లో చట్టం అమలు తీరును సమీక్షించారు. ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ( ఐసీసీ ) ఏర్పాటు చేసి, మహిళలు తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించేలా సానుకూల వాతావరణం కల్పించాలని శైలజ సూచించారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు నిష్పక్ష పాతంగా, చట్టబద్ధంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని, బాధిత మహిళల గోప్యతను కాపాడాలని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులకు చట్టంలోని నిబంధనలు, ఫిర్యాదుల స్వీకరణ, విచారణ విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించాల న్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, తమకు జరిగిన అన్యాయాన్ని నిర్భయంగా వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. చట్టం అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, మహిళా ఉద్యోగులకు హక్కులు, ఫిర్యాదు విధానం, రక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. శ్రీలక్ష్మి, మహిళా కమిషన్ అడ్వైజరీ సభ్యురాలు ఆర్. సుయాజ్, వివిధ శాఖల అధికారులు, సీడీపీవోలు, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాహుకేతువులుగా మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు

- నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయి.
- రాబోవు స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా కూటమి పార్టీలకు కర్ర కాల్చి వాతలు పెట్టాలి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం ప్రజల పాలిట రాహు కేతువులుగా దాపురించాయని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకు పడ్డారు. మంగళ వారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మాటలు కోటలు దాటుతున్నాయి కానీ తెడ్డు మాత్రము గడప దాటడం లేదు అన్నట్లుంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు అన్నారు. వీరి పిట్టలదొర ప్రసంగాలు, ఉత్తర కుమార ప్రగల్భాలు వినలేక ప్రజలు విసిగెత్తిపోయా రన్నారు. ప్రజలకు మోడీ అరచేతిలో వైకుంఠం చూపిస్తుండగా, చంద్రబాబు అరచేతిలో కైలాసం చూపిస్తు న్నాడు. 2026 గురించి మాట్లాడకుండా పదేపదే 2047గురించి మాట్లాడడం ఇద్దరికీ పరిపాటి అయింద న్నారు. మోడీ గారేమో 2047కు వికసితభారత్, స్వర్ణ భారత్ చేస్తారట! చంద్రబాబు ఏమో 2,047కు స్వర్ణాంధ్ర, వికసితాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, సంతోష ఆంధ్ర, రైజింగ్ రాయలసీమ చేస్తాడట!

నిత్యావసర సరుకుల ధరలు సామాన్యునికి అందు బాటులో లేవు. ఆకాశాన్ని అంటుతున్నాయి. బియ్యం, పప్పు దినుసులు, వంటనూనెలు, కాయగూరలు, ఆకుకూరలు, మిర్చి, ఉల్లి,చక్కెర ఇలా అన్ని వస్తువులు ధరలు ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగి పోయాయి."ఏమి కొనేటట్టు లేదు - ఏమి తినేటట్టు లేదు" అన్నట్టుంది పరిస్థితి. గృహిణులు వంటగదిలేక పోవాలంటే భయపడిపోతున్నారు. ప్రజలు మార్కెట్లోకి పోవాలంటే హడలిపోతున్నారు. కాంగ్రెస్ పాలనలో జేబులో డబ్బు పెట్టుకుని మార్కెట్ కు పోయి సంచిలో సరుకు తీసుకు వచ్చేవారు. ప్రస్తుతం చంద్రబాబు పాలనలో ప్రజలు సంచిలో డబ్బులు పెట్టుకొని బజారుకుపోయి జేబులో సరుకు తెచ్చుకునే పరిస్థితి దాపురించిందని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం,రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో ఘోర వైఫల్యం చెందాయి అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓట్ల ద్వారా టిడిపి, బిజెపి,జనసేన పార్టీలకు కర్రు కాల్చి వాతలు పెట్టాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, వేముల మండల శాఖ అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వేమయ్య, బద్రి, రాఘవయ్య, చిన్నకోట్ల నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

# పేదల రేషన్ బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు

- విజిలెన్స్ నిఘాను మరింత పెంచాలి: ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా, అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు, విజిలెన్స్ విభాగం కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ (ఆహార సలహా కమిటీ) సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై సమావేశంలో పలు అంశాలను చర్చించారు. రేషన్ షాపులపై నిరంతరం నిఘా ఉంచి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి వారికి కేటాయించిన బియ్యం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ అధికారులను కోరారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ.70 నుంచి రూ.80 వరకు ఉన్న నేపథ్యంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోకుండా మరింత కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమన్నారు. అక్రమ రవాణాకు పాల్పడేవారిపై, రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల పేరిట స్మార్ట్ రైస్ కార్డుల జారీని స్వాగతించిన ఎంపీ.. సంక్షేమ పథకాల అమలును ప్రజల తరఫున పర్యవేక్షించేందుకు విజిలెన్స్ కమిటీలకు ఉన్న అవకాశాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు .ప్రజల అవసరాలకు అనుగుణంగా రేషన్ షాపుల్లో గోధుమ పిండి సరఫరా చేయాలని, వాట్సాప్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను వేగంగా పరిష్క రించాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా సబ్సిడీపై ఉల్లిపాయలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**రేషన్ షాపుల్లో స్టాక్ సమస్యలపై సభ్యుల ఫిర్యాదులు**

సమావేశంలో సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రామ్‌నగర్, లక్ష్మీనగర్, కొవ్వూరునగర్ ప్రాంతాల్లోని కొన్ని రేషన్ డీలర్ షాపుల్లో బియ్యం అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. నెలలో 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వినియోగదారులకు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ముందుగానే స్టాక్ అయిపోతున్న పరిస్థితి ఉందని సభ్యులు ప్రస్తావించారు. రేషన్ షాపుల్లో బియ్యం, పంచదారతో పాటు రాగులు, జొన్నలు కూడా అందుబాటులోకి తీసుకురావాలని సభ్యులు కోరారు. గర్భిణులు, బాలింతలకు ఫేస్ యాప్, బయోమెట్రిక్, క్యూఆర్ కోడ్ సమస్యల కారణంగా రేషన్ అందకపోతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు ఎదుర్కొంటున్న బయో మెట్రిక్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమావేశంలో కోరారు.

# ప్రజలకు మెచ్చిన పాలన జగనన్నకే సాధ్యం

- టిడిపి నుంచి వైయస్సార్లోకి చేరికలు
- ప్రజల కోసం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది (సాకే శైలజనాథ్)



**గార్లదిన్నె - సూర్య వాస్తవం :** శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలంలోని కల్లూరు ఇల్లూరు ముంటిమడుగు ఎంపీటీసీ స్థానాల పరిధిలోని నాయకులు కార్యకర్తలతో జిల్లా వైసీపి రైతు విభాగం అధ్యక్షులు వై.నారాయణరెడ్డి,పార్టీ మండల అధ్యక్షులు ఎల్లారెడ్డిల ఆధ్వర్యంలో వైఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశమునకు నియోజకవర్గ సమన్వయకర్త మాజీమంత్రి డాక్టర్ సాకే.శైలజనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్.సాకే శైలజనాథ్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీకి అండగా నిలవాల్సిన సమయం, సందర్భం వచ్చిందని, జగనన్న నాయకత్వంలో మన పార్టీ ప్రజలకు చేసిన పథకాల గూర్చి క్షుణ్ణంగా ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం యొక్క అక్రమాలు అవినీతి గూర్చి ప్రత్యేకంగా ప్రజలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాల పట్ల వైసిపి నిరంతరం పోరాడితే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉపాధి పథకం రూపంలో అభివృద్ధి పేరుతో మద్యం రూపంలో ఆ పార్టీల నాయకులు కార్యకర్తల ఫీల్డ్ అసిస్టెంట్లకు జేబులు నింపింది తప్ప ప్రజల సంక్షేమాలు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి కూడా సముచిత స్థానం కల్పించాలి. పదవులు ఎవరికైనా రావచ్చుకానీ పార్టీకోసం కష్టపడే కార్య కర్తకు గౌరవం ఎప్పటికీ ప్రత్యేకత ఉంటుందన్నారు. మనపై ప్రజలకు నమ్మకం ఉండాలంటే ప్రజల మధ్య నిరంతరం ఉండాలి.ప్రజల కోసం పోరాడే పార్టీకి ఎప్పుడూ పని ఉంటుంది. ప్రజల మధ్య ఉండే కార్యకర్తకు ఎప్పుడూ గౌరవం ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో మనం ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయాలి.ఏ ఒక్క కార్యకర్త భయపడాల్సిన పనిలేదు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా అండగా నేనున్నానన్న విషయం గుర్తు పెట్టుకోవాలి అన్నారు.కల్లూరు గ్రామంలో టిడిపి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి 21 కుటుంబాల యువకులు చేరగా వారికి శైలజానాథ్ చేతుల మీదుగా వైసిపి కలవాలని వేసి సాధారణంగా ఆహ్వానించారు.

**పార్టీలో చేరిన వారు:** జయప్రకాష్య, జశ్వంత్ రెడ్డి, రఘుయాదవ్, నరేష్ నాయుడు, కళ్యాణ్ వాల్మీకి, వీరాంజి, నరేంద్ర, సిద్ధు, ఫయాజ్ అంగజాల బన్నీ, మంజు, నందు, ఏరిస్వామి తదితరులు చేరారు.ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, చిదంబరెడ్డి, గాంధీ, చీమలశ్రీనివాసులు, రాధాకృష్ణ,కల్లూరు ప్రసాద్, లక్ష్మీదేవమ్మ, దేవా జగన్, సురేష్ ,మోహన్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, శంకర్ రెడ్డి, వీర , బాలిరెడ్డి, నల్లప్ప ,కేశవయ్య, శిక్షావలి, షారోన్ ,రఫీ, జాఫర్ వల్లి,టోపీ ఆంజనేయులు, రఘు వర్మ,సుదర్శన్ రెడ్డి, రామాంజనేయులు, భాస్కర్ రెడ్డి, పుష్పలత నాగ,వెంటయ్య,శ్రీనివాసులు, బసిరెడ్డి, నరసింహులు, రవి, కృష్ణ, వీరేష్,ఎంపీటీసీలు తదితర నాయకులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140